Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక



కావలెను

ప్రజాతీర్పు The people's Verdict తెలుగు జాతీయ దినపత్రిక

The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు

8309979541, 9885353018, 9494659622



సంపుటి : 26 | సంచిక : 236 | హైదరాబాద్ | శుక్రవారం 10 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR




## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపేశా

### మరోసారి ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: గత ఏడాది భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే స్వయంగా జోక్యం చేసుకొని నిలిపివేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఆయన బుధవారం తుర్కియే నుంచి తిరిగివస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మాట్లాడారు. భారత్--పాక్ యుద్ధంలో 11 ఫైటర్ జెట్లు నేలకూలాయని చెప్పారు. అయితే, అవి ఏ దేశానికి చెందినవన్న సంగతి బయటపెట్టలేదు. భారత్--పాక్ యుద్ధం సహా ప్రపంచవ్యాప్తంగా 8 యుద్ధాలను తాను ఆపేశానని

- మిగతా 2వ పేజీలో



# కాళేశ్వరం కహానీ!

## మరోసారి హాట్ టాపిక్‌గా ప్రాజెక్టు

### నీళ్లు వదలాల్సిందే అంటున్న బీఆర్ఎస్

ప్రమాదం అంటున్న అధికార కాంగ్రెస్

బీఆర్ఎస్‌కు చెడ్డపేరు తీసుకొచ్చేందుకే: కేటీఆర్, హరీష్

అసెంబ్లీకి వస్తే అన్ని వివరిస్తాం: రేవంత్

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

రాష్ట్ర రాజకీయాల్లో కాళేశ్వరం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్టు నీటి విడుదలపై సవాళ్లు.. ప్రతిసవాళ్లు విరుసుకుంటున్నాయి. గోదావరి నదిలో వరద నీరు పుష్కలంగా ప్రవహిస్తున్న తరుణంలో, ప్రాజెక్టు మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలంటూ బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుండగా.. పొరపాటున ఇప్పుడు గనుక పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టు బ్యారేజీలు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.

#### మిడ్..లోయర్ మానేరు నింపాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావులు కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్ హౌస్‌లు, మోటార్లు అన్నీ సురక్షితంగా ఉన్నాయని, కేవలం కొన్ని బ్యారేజీల పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నాయని అంటున్నారు. వరద నీరు సముద్రం పాలు కాకుండా, పంపింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి

- మిగతా 2వ పేజీలో



## 57% ఉత్పత్తులపై సున్నా సుంకాలు!

### భారత మార్కెట్‌లో మా ఉత్పత్తులకు విస్తృత ప్రవేశం

### న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ వెల్లడి

వెల్లింగ్టన్: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కింద తమ దేశం నుంచి భారత్‌కు ఎగుమతి జరిగే ఉత్పత్తుల్లో 57 శాతం ఉత్పత్తులపై సుంకాలు సున్నాకు చేరుకుంటాయని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌లో పోస్టుచేశారు. ఇరుదేశాల మధ్య ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన తొలిరోజు నుంచే సున్నా శాతం సుంకాలు అమల్లోకి వస్తాయన్నారు. ఈ ఒప్పందంతో న్యూజిలాండ్ వ్యాపారాలు భారీగా వృద్ధి చెందనున్నాయని తెలిపారు. భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు విస్తృత ప్రవేశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10, 11న న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. భారత ప్రధాని న్యూజిలాండ్‌కు వెళ్తుండడం గత 40 ఏళ్లలో ఇదే తొలిసారి. న్యూజిలాండ్‌తో

- మిగతా 2వ పేజీలో



## భారత్ కలలు ఆశయాలకు ప్రజలే పునాది

### అభివృద్ధి చెందిన దేశంగా మారే లక్ష్యం దిశగా పయనం

'సిందూర్'లో భారత రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని చూసిన ప్రపంచం

'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ'లో ప్రధాని స్పష్టీకరణ

మెల్‌బోర్న్: 'ఎక్కువగా కష్టపడడం, మరింత ఎక్కువగా సాధించడం'అనే దార్శనికతతో అభివృద్ధి చెందిన దేశంగా మారే లక్ష్యం దిశగా భారత్ పయనిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. భారతదేశం గొప్ప కలలు, ఉన్నత ఆశయాలకు ప్రజలే పునాది అని

- మిగతా 2వ పేజీలో

# రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం



- సీఎం రేవంత్‌రెడ్డి సొంత సర్వేలోనూ ఇదే తేలింది
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 78 సీట్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 9: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పతనమైందని, ఇదే అంశం సీఎం రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ తేలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. దీంతో పాటు రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం సుస్పష్టంగా వ్యక్తమైందన్నారు. మరోసారి ప్రజలు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నామని స్పష్టంగా తమ

- మిగతా 2వ పేజీలో

# నగరాల్లో ఇళ్లు కొనలేం!

### సామాన్యుడు.. మధ్య తరగతికి అందని రేట్లు

ఏడాదిలోనే గణనీయ వృద్ధి

భాగ్యనగరంలోనూ అదే తీరు

విశాలమైన విల్లాలవైపే నగరవాసుల చూపు

(సయ్యద్ ముజీబ్ అక్తర్, ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

పట్నం అంటే అందరికీ మోజే.. ఆ మోజుతోనే పల్లెలు వదిలి నగరాలకు వచ్చి అద్దె ఇళ్లలో పడరాని పాట్లు పడుతుంటారు. నగరంలో తమకో సొంత ఇల్లు కావాలని అష్టకష్టాలు పడుతుంటారు. అయితే, దేశంలోని ప్రధాన నగరాల్లో సామాన, మధ్యతరగతి వారు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం అంత ఈజీ కాదని లెక్కలు చెబుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు రికార్డు స్థాయిలో పెరిగిపోతున్నాయని మార్కెట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

#### 22 శాతం వార్షిక వృద్ధి

భారతదేశంలోని టాప్ తొమ్మిది ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత ఏడాది దేశవ్యాప్తంగా రిజిస్టర్డ్ ఇళ్ల సగటు విలువ రూ. 70 లక్షలుగా ఉండగా, అదిప్పుడు ఏకంగా 22 శాతం వార్షిక వృద్ధితో రూ. 81 లక్షలకు చేరుకుంది. నిర్మాణ రంగానికి అవసరమైన ముడిసరుకుల ధరలు పెరగడం, ప్రీమియం గృహాలకు డిమాండ్ అధికమవడం వల్లనే ఈ స్థాయి ధరల పెరుగుదల నమోదైందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, దేశీయ ఐటీ హాట్‌స్పాట్ అయిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ కూడా తన పంథాను కొనసాగిస్తోంది. గత రెండేళ్లుగా ఇక్కడి మార్కెట్ ఎటువంటి హెచ్చుతగ్గులు లేకుండా అత్యంత స్థిరంగా సాగుతోంది. పశ్చిమ హైదరాబాద్‌తో పాటు కొత్తగా విస్తరిస్తున్న ఉత్తర, దక్షిణ కారిడార్లలోనూ ప్రాపర్టీల ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఇటు ఇన్వెస్టర్లకు, అటు ఎండ్-యూజర్లకు నమ్మకం కలిగించేలా భాగ్యనగర రియల్ రంగానికి డిమాండ్ ఏమాత్రం తగ్గకుండా స్థిరమైన వృద్ధి రేటును నమోదు చేస్తోంది. ఈ సగటు రిజిస్ట్రేషన్ విలువల వృద్ధిని గమనిస్తే.. మార్కెట్లో అఫర్డబుల్ హౌసింగ్ వాటా తగ్గిపోతూ, రూ. 80 లక్షల నుండి రూ. 1.5 కోట్ల బడ్జెట్ పరిధిలోని మిడ్-సెగ్మెంట్, , లగ్జరీ గృహాల కొనుగోళ్లు పెరిగాయని స్పష్టమవుతోంది. డెవలపర్లు కూడా



- మిగతా 2వ పేజీలో



## మమ్మల్ని కొన్నాళ్లు పని చేయనివ్వండి

### అభివృద్ధి జరగనివ్వండి: సీఎం రేవంత్

రాజకీయాలకు సమయం కాదు.. ఎన్నికలప్పుడే రాజకీయాలు

ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

రంగారెడ్డి: 'మేము చేస్తున్న అభివృద్ధి పనులకు సహకరించకపోయినా పరవాలేదు కానీ.. అడ్డు తగులుతూ కడుపులో ఉన్న విషాన్నంతా రోజూ మాపై కక్కొద్దు.. రాజకీయాలు ఏమైనా ఉంటే ఎన్నికలప్పుడు చూసుకుందాం. ఎవరు ఏం చేశారో?

- మిగతా 2వ పేజీలో

## తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి

### అప్పుడే పార్టీ బలోపేతం అవుతుంది

వచ్చే ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది

రాష్ట్ర పార్టీ నేతలతో కేంద్రమంత్రి జేపీ నడ్డా

హైదరాబాద్: బీజేపీలోకి ఇతర పార్టీల వారిని చేర్చుకునేందుకు తలుపులు తెరవాలని రాష్ట్ర పార్టీ నేతలకు కేంద్ర ఆరోగ్య, రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా సూచించారు. వేరే పార్టీలకు చెందిన వారిని కలుపుకుంటేనే బీజేపీ మరింత బలోపేతం

- మిగతా 2వ పేజీలో



# భారత్–పాక్ యుద్ధాన్ని నేనే ఆపేశా

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఈ ఘనత సాధించినందుకు నోబెల్ శాంతి బహుమ తికి తాను అన్నివిధాల అర్హుడినని స్పష్టంచేశారు. తనకంటే అర్హులు ఇంకెవరున్నారని ప్రశ్నించారు. ఒకవేళ తాను జోక్యం చేసుకోకపోతే భారత్--పాక్ ఘర్షణ అణు యుద్ధంగా మారేదని పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపడం ద్వారా 3 కోట్ల నుంచి 5 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడారంటూ పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనను ప్రశంసించారని ట్రంప్ గుర్తుచేశారు. అణు యుద్ధమే జరిగితే అంతకంటే ఎక్కువగానే ప్రాణనష్టం వాటిల్లి ఉండేదన్నారు. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్ భూభాగంలో ముష్కర మూకల స్థావరాలపై గత ఏడాది మే 7న ‘ఆపరేషన్ సిందూర్’ను ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# 57% ఉత్పత్తులపై సున్నా సుంకాలు!

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్యం, రక్షణ, పరస్పర సహకారం తదితర అంశాలపై ప్రధాని మోదీ దృష్టిపెట్టనున్నారు. అంతేకాకుండా వ్యాపారవేత్తలు, క్రీడాకారులతోనూ సమావేశం కానున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి.



# నగరాల్లో ఇళ్లు కొనలేం!

(మొదటి పేజీ తరువాయి)

కస్టమర్ల మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఆధునిక వసతులతో కూడిన ప్రాజెక్టులనే ఎక్కువగా లాంచ్ చేస్తున్నారు. ఫలితంగా, రిజిస్ట్రేషన్ల సంఖ్యలో స్వల్ప మార్పులు ఉన్నప్పటికీ, మొత్తం సేల్స్ వాల్యూమ్ , సగటు మార్కెట్ విలువలో భారీ జంప్ కనిపిస్తోంది. ఈ విపరీతమైన ధరల పెరుగుదల సాధారణ కొనుగోలుదారులను కొంతవరకు ఆలోచనలో పడేస్తోంది. హోమ్ లోన్లపై వడ్డీ రేట్లు ఇంకా గరిష్ట స్థాయిల్లోనే కొనసాగుతుండటం, దానికి తోడు ఇళ్ల ధరలు 22 శాతం పెరగడంతో సామాన్యులు తమ బడ్జెట్ పరిమితులను దాటాల్సి వస్తోంది. అయినప్పటికీ, మౌలిక వసతుల విస్తరణ, మెట్రో కనెక్టివిటీ , కొత్త ఉపాధి అవకాశాల రీత్యా రాబోయే రోజుల్లో కూడా ధరల పెరుగుదల ఇలాగే కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయని రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### విశాలమైన ఇళ్లకే ఓటు

కరోనా తర్వాతి పరిణామాల్లో కస్టమర్లు విశాలమైన, అన్ని రకాల అత్యాధునిక వసతులు ఉన్న ఇళ్లకే ప్రాధాన్యత ఇస్తుండటంతో.. బిల్డర్లు సైతం లాభాలు ఎక్కువగా వచ్చే ఈ లగ్జరీ సెగ్మెంట్‌పైనే పూర్తి ఫోకస్ పెట్టారు. సాధారణంగా నగరాలకు వలసలు పెరిగినప్పుడు అందరికీ అందుబాటు ధరల్లో ఇళ్లు లభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ మార్కెట్ శైలి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మధ్యతరగతి వారు నగర శివార్లలో కూడా ఇళ్లు కొనే పరిస్థితి లేకుండా పోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రూ. 1.5 కోట్లు అంతకుమించి ధర పలికే విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ లగ్జరీ అపార్ట్‌మెంట్ల వాటా ప్రస్తుతం మార్కెట్లో ఏకంగా 53 శాతానికి చేరుకుంది.

# కాళేశ్వరం కహానీ!

(మొదటి పేజీ తరువాయి)

మిడ్ మానేరు, లోయర్ మానేరు వంటి రిజర్వాయర్లను నింపాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కావాలనే పొలిటికల్ మైలేజ్ కోసం, గత ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే కుట్రతోనే కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయడం లేదని బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్‌తో పాటు ఆ పార్టీ శ్రేణులు గట్టిగా ప్రచారం చేస్తున్నాయి. తద్వారా ప్రాజెక్టును ఎందుకూ పనికిరానిది గా చిత్రించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

### బ్యారేజీల పునాదులు కదిలాయి..

బీఆర్ఎస్ చెబుతున్నట్లు పంప్ హౌస్‌లు బాగున్నాయన్నది నిజమే అయినా, ఆ పంపులకు నీటిని అందించే మేడిగడ్డ , అన్నారం బ్యారేజీల పునాదులు కదిలిపోయాయని ఎన్డీఎస్ఏ రిపోర్టు ఉందని ప్రభుత్వం చెబుతోంది. నిల్వ ఉంచే సామర్థ్యం లేని చోట పంపింగ్ చేయడం అసాధ్యమని కాంగ్రెస్ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన గైడ్‌లైన్స్, మధ్యంతర నివేదికలను బలంగా చూపిస్తోంది. గత ఏడాది మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం బ్యారేజీలో ఊటలు రావడం వంటి ఘటనల తర్వాత రంగంలోకి దిగిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బ్యారేజీలలో పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగకుండా, పునాదుల కింద గ్రౌటింగ్ పూర్తికాకుండా నీటిని నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేసింది. బ్యారేజీలో నీటిని నిల్వ ఉంచితే ఏర్పడే హైడ్రోస్టాటిక్ ప్రెజర్ వల్ల మిగిలిన పిల్లర్లు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది. బ్యారేజీలో నీరు నిలబడితేనే పంప్ హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుంది, కాబట్టి బ్యారేజీలు బలహీనంగా ఉన్నప్పుడు నీటిని ఎత్తిపోయడం అంటే ఆత్మహత్యాసదృశ్యమేనని అధికార పక్షం అంటోంది.

### అసెంబ్లీలో చర్చకు సవాల్

కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలకు ఓ బహిరంగ సవాల్ విసిరింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లోపాలు, అడ్డగోలు ఖర్చులు, ప్రస్తుత దుస్థితిపై అసెంబ్లీ వేదికగా సుదీర్ఘమైన లైవ్ చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విపక్ష నేతలకు సవాల్ చేశారు. అసెంబ్లీలో గనుక సమగ్రంగా చర్చిస్తే.. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన సాంకేతిక తప్పిదాలు, విచారణ కమిషన్ల నివేదికలు, జ్యుడీషియల్ ఎంక్వైరీ వివరాలన్నీ అధికారికంగా ప్రజల ముందుకు వస్తాయి. దీనివల్ల కాళేశ్వరం ప్రాజెక్టు రీ–డిజైనింగ్ పేరిట జరిగిన వేల కోట్ల రూపాయల వ్యయం వెనుక ఉన్న అసలు నిజాలు బయటపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సవాల్‌పై హరీష్ రావు స్పందించారు. అయితే కేసీఆర్ ఎందుకని తామే వస్తామని ఆయన అంటున్నారు. గతంలో కాళేశ్వరంపై జరిగిన లఘు చర్చలకు గులాబీ బాస్ కేసీఆర్ హాజరుకాలేదు. ఒకవేళ ఈసారి అసెంబ్లీలో గనుక కాళేశ్వరంపై పూర్తిస్థాయి పోరు జరిగితే, అది ఉభయ పార్టీలకు చావో రేవో లాంటి పరిస్థితిగా మారుతుంది. తాము నిర్మించిన ప్రాజెక్టును కాంగ్రెస్ చేతకానితనంతోనే వదిలేసిందని నిరూపించాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంటే.. ప్రాజెక్టు కేవలం ఒక కమీషన్ల స్కామ్ అని, కేసీఆర్ నిర్వాకం వల్లే ఇవాళ నీళ్లు పోయలేకపోతున్నామని తెలంగాణ ప్రజలకు బలంగా చాటాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. మొత్తంగా ఈ విషయంలో అసలేం జరిగిందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని భావన వ్యక్తమవుతోంది.

# మమ్మల్ని కొన్నాళ్లు పని చేయనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అప్పుడు చర్చిద్దాం. మమ్మల్ని కొంతకాలం పని చేసుకోనివ్వండి..’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారం కోల్పోయిన బాధ మీకు ఉన్నా అభివృద్ధి జరగనివ్వండని పరోక్షంగా విపక్ష బీఆర్ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల సామర్థ్యంగల సోలార్ మాడ్యూళ్ల తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని రేవంత్ చెప్పారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నా మన్నారు. కాలుష్యం కారణంగా దేశ రాజధాని ఢిల్లీ లాంటి నగరాల్లో నివసించలేని పరిస్థితి తలెత్తిందని, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని సీఎం పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ నగరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అందుకే హైదరాబాద్ నగరంలో కాలుష్య రహిత అభివృద్ధి జరగాలని నిర్ణయించా మని వివరించారు.

### నైపుణ్య పెంపు బాధ్యత పరిశ్రమలదే..

ప్రస్తుతం వైట్‌కాలర్ ఉద్యోగాలకు కాలం చెల్లింది. స్కిల్స్ ఉన్న వారికి బ్లూకాలర్ జాబ్స్‌కు కొదవ లేదు. ఇప్పటివరకు అమెరికా వైపు చూశాం. ప్రస్తుతం జర్మన్, జపాన్, చైనా, సౌత్ కొరియాను ఆదర్శంగా తీసుకుంటున్నాం. ఆయా దేశాలతో పోటీపడదాం. రాష్ట్రంలో ఏటా 10 లక్షల మంది



ఇంజనీరింగ్ పట్టాలు తీసుకుని బయటికి వస్తున్నారు. సంబంధిత సాంకేతిక నైపుణ్యం లేకపోవడంతో పది శాతం మందికి కూడా ఉద్యోగ అవకాశాలు లభించడం లేదు. వీరి నైపుణ్యాలను పెంచి, అవకాశాలు కల్పించే బాధ్యతలను పరిశ్రమలు తీసుకోవాలి.

### నిర్వాసితులకు ఇంటి పట్టాలు

రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10 శాతం భాగస్వామ్యం కలిగి ఉండటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. సీతారాంపురంలో సోలార్ మాడ్యూల్ ప్లాంట్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందంటూ.. గ్రామంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు, ఉపాధి కోసం వ్యాపార సముదాయాలను నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు త్యాగం చేయడం వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

### తెలంగాణ విశ్వవ్యాప్తం కావాలి: మంత్రి శ్రీధర్‌బాబు

‘కేవలం పెట్టుబడులు ఆకర్షించడమే కాదు. ఆవిష్కరణలు, తయారీ ఇక్కడే జరగాలి. మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఇక్కడి నుంచే ప్రపంచానికి ఉత్పత్తులను అందించాలి. ఇదే మా ప్రభుత్వ సంకల్పం’అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రీమియర్ ఎనర్జీస్ లాంటి ప్రపంచ స్థాయి సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు తెలంగాణను ఎంచుకోవడం ఇక్కడి పారిశ్రామిక ప్రగతికి, రాష్ట్ర ప్రభుత్వంపై ఇన్వెస్టర్లకు ఉన్న విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

### 3 వేల మందికి ఉపాధి అవకాశాలు

సోలార్ మాడ్యూళ్ల తయారీ కేంద్రం 75 ఎకరాల్లో ఏర్పాటైంది. యూనిట్ పూర్తి సామర్థ్యానికి చేరుకుంటే 3 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి. కంపెనీ 6 గిగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఫెసిలిటీతో పాటు ఏటా 18 వేల మెట్రిక్ టన్నుల తయారీ సామర్థ్యంతో రానున్న అల్యూమినియం ఫ్రేమ్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసింది. దేశవ్యాప్తంగా ప్రస్తుత కేంద్రాల విస్తరణ, నూతన ఫెసిలిటీల కోసం సంస్థ 2028 నాటికి సుమారు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తోంది.

# భారత్ కలలు ఆశయాలకు ప్రజలే పునాది

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టంచేశారు. గురువారం ఆస్ట్రేలియాలో ‘మెల్‌బోర్న్ మీట్స్ మోదీ’కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణల రంగాల్లో భారత్, ఆస్ట్రేలియా మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 21వ శతాబ్దంలో సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా మారే లక్ష్యం దిశగా భారత్ కృషి చేస్తోందన్నారు. నాగరిక్ దేవోభవ(పౌరుడే దైవం) అనే మంత్రం తమ పాలనకు మార్గదర్శక సూత్రంగా మారిందని ప్రకటించారు. తమ ప్రభుత్వ విధానాలు పౌరుల సంక్షేమమే కేంద్రంగానే ఉంటాయన్నారు. భారత్ నేడు చిప్స్ నుంచి షిప్‌ల వరకు ఒక నూతన తయారీ వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ గురించి మోదీ ప్రస్తావించారు. ఈ ఆపరేషన్ సమయంలో భారత రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని, విశ్వసనీయతను ప్రపంచం చూసిందన్నారు. ముష్కర మూకల స్థావరాల వద్ద పేలుళ్లు జరిగితే వాటి ప్రతిధ్వని ప్రపంచవ్యాప్తంగా మార్మోగిందని వ్యాఖ్యానించారు.

### మిత్రులు, భాగస్వాములతో కలిసి..

భారత్‌లో స్టార్టప్‌ల సంఖ్య వేగంగా పెరుగుతోందని మోదీ వెల్లడించారు. దేశంలో 2 లక్షలకుపైగా నమోదిత స్టార్టప్‌లు ఉన్నాయని, ప్రతినెలా 4 వేలకుపైగా కొత్త స్టార్టప్‌లు నమోదవుతున్నాయని చెప్పారు. రక్షణ, అంతరిక్షం వంటి రంగాల్లో వందలాది స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ అంతరిక్ష స్టార్టప్ తన సొంత రాకెట్ ద్వారా ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఇండియా విధానం కేవలం సొంత పురోగతిపై దృష్టి సారించడం మాత్రమే కాదని.. మిత్రులు, భాగస్వాములతో కలిసి అడుగులు వేయడమని నొక్కిచెప్పారు.

### ప్రవాస భారతీయులే ‘జీవన వారధి’

వెనెజువెలాలో ఇటీవల భూకంపాలు సంభవిస్తే భారత్ వెంటనే స్పందించి, సహాయక చర్యలు



చేపట్టిందని, త్వరగా తోడ్పాటు అందించిందని ప్రధానమంత్రి చెప్పారు. వెనెజువెలా బాధను భారత్ తన సొంత బాధగా భావించిందని అన్నారు. సహాయం చేసేటప్పుడు పాస్‌పోర్ట్‌లను గానీ, వాటి రంగును గానీ భారత్ చూడదని ఉద్ఘాటించారు. అందుకే ప్రపంచం భారత్‌పై అపారమైన నమ్మకాన్ని పెట్టుకుందని చెప్పారు.

భారత్--ఆస్ట్రేలియా సంబంధాలు బలపడడం వెనుక ప్రవాస భారతీయులదే కీలక పాత్ర అని మోదీ ప్రశంసించారు. వారిని రెండు దేశాల మధ్య ‘జీవన వారధి’గా అభివరి?ణంచారు. ఇంట్లో ఉపయోగించే పాలు ఆస్ట్రేలియన్ కావొచ్చు గానీ తయారుచేసే టీ మాత్రం భారతీయమైనదని చెప్పారు. పప్పులు, కూరగాయలు ఆస్ట్రేలియాలవే అయినా వాటికి అసలైన భారతీయ మసాలాలతో తాలింపు పెడతారని వెల్లడించారు. మెల్‌బోర్న్ సిటీని మినీ ఇండియాగా అభివరి?ణంచారు.

### టీ20 మ్యాచ్‌లా.. టెస్ట్ మ్యాచ్‌లా

రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి క్రీడల రంగం కూడా ఉందని మోదీ అన్నారు. ప్రపంచ క్రీడా రాజధాని అయిన మెల్‌బోర్న్‌లో ఉంటూ క్రీడల గురించి మాట్లాడకపోవడం అనేది టాస్ వేసిన తర్వాత క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించకపోవడంతో సమానమని సరదాగా వ్యాఖ్యానించారు. మన నిర్ణయాలు టీ20 మ్యాచ్‌లా వేగంగా, భాగస్వామ్యం మాత్రం టెస్ట్ మ్యాచ్‌లా సుదీర్ఘంగా, లోతుగా ఉండాలని అన్నారు. భారత్--ఆస్ట్రేలియా దేశాల అజెండా ఒక వన్డే మ్యాచ్‌లా లక్ష్యంపైనే దృష్టి సారిస్తుందని ప్రధానమంత్రి తేల్చిచెప్పారు.

# తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)



అవుతుందని చెప్పారు. రాష్ట్ర పార్టీ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ‘మీరు కష్టపడి పనిచేయండి మీతోపాటు మేము ఉంటాం. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను ప్రతి ఒక్కరూ అభిమానిస్తారు. మీ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని అభిమానించేంతలా చూసుకోవాలి. కార్యకర్తలతో మంచిగా ఉండండి. వారితో మంచిగా లేకుంటే మీరు డిస్‌కనెక్ట్ అవుతారు’అని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తమకు సమాచా రం ఉందన్నారు. గురువారం రాష్ట్రానికి వచ్చిన నడ్డా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమైనప్పుడు ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. ‘ఇప్పటికే ఒకసారి మన బస్సు (అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి) మిస్సయింది. ఇంకోసారి బస్సు మిస్ కానివ్వకండి. వేర్లు లేని చెట్ల లాగా మారకండి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వ్యతిరేకతే మనల్ని గెలిపిస్తుందనే భావనతో ఉండకండి. సొంతంగా పార్టీ గెలిచేందుకు మనం ఏం చేస్తున్నాము అనేది కూడా చాలా ముఖ్యం. నేను అవినీతికి పాల్పడను. ఇంకొకరిని అవినీతి చేయనివ్వను అన్న ప్రాథమిక సూత్రంతోనే మోదీ విజయం సాధించారు.

మనమంతా కూడా మోదీ పేరు చెప్పుకొని గెలుస్తున్నా...సొంతంగా గెలుపు కోసం అనుసరించబోయే కార్యాచరణ ఉందా ? మీ అంత మీరు గెలిచేందుకు ఏం చేస్తున్నారు? ఆత్మవిమర్శ చేసుకోండి. అవినీతితో పోరాడడంతోపాటు ఎల్లప్పుడూ ప్రజల పక్కనే చేదోడువాదోడుగా నిలిస్తే తప్పకుండా వారు ఆదరిస్తారు. మీ మీ కార్యక్షేత్రాలను వదలకుండా కష్టపడి పనిచేయాలి. లీడర్ల వెంట తిరిగినంత మాత్రాన లీడర్లు కాలేరు. రేపు కాంగ్రెస్ నేతలను (హిమాచల్‌లో) కలవడానికి వెళుతున్నాను. ఎందుకంటే వారిని కలిస్తే వారు మనవారు అవుతారు’అని నడ్డా దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డా.కె.లక్ష్మణ్, బీజేఎల?పనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీనేతలు పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటిమోహన్‌రావు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, శాంతికుమార్, చింతల రామచంద్రారెడ్డి బండారు విజయలక్ష్మి, లంకెల దీపక్‌రెడ్డి, కప్పర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు ఏటీఎంగా మార్చిన సర్కార్ ఉండాలా ?

ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రభుత్వం ఏటీఎంగా మారిందని, అదే ప్రభుత్వం కొనసాగాలా? మారాలా? అన్నది రాష్ట్ర ప్రజలు నిర్ణయం తీసుకోవాలని జేపీ నడ్డా పిలుపునిచ్చారు. గురువారం ఓ హోటల్‌లో ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో ‘ప్రజాస్వామ్యం--దౌత్యం--అభివృద్ధి’అంశంపై నిర్వహించిన మేధావుల గోష్టిలో నడ్డా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌ను అంతర్గతంగా బలోపేతం చేస్తూనే, ప్రపంచవ్యాప్తంగా దేశ గౌరవాన్ని శిఖరాగ్రానికి చేర్చిన ఘనత ప్రధాని మోదీదని కొనియాడారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయం చెప్పిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే, తన సొంత సర్వేతో పాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజావ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అన్నారు. గురువారం హైదరా బాద్ జీహెచ్ఎంసీ నగర నేతలు, ప్రజాప్రతినిధులతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో జరిగిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం తన పరిపాలన వైఫల్యాలను ముఖ్యంగా కప్పిపుచ్చుకునేందుకు అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం నుంచి మొదలుకొని రైతుబంధు వరకు అన్నింటిపైన అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన గ్యారంటీల అమలు, గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందువల్లనే తెలంగాణలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై నమ్మకం కోల్పోయారని తెలిపారు.

దీంతో పాటు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా స్పష్టంగా ప్రజలు బీఆర్ఎస్ కావాలని కోరుకుంటున్నారని, బీజేపీ లాంటి ఇతర పార్టీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ జారుడు బండపైన నిలబడిందని, ఇక పుంజుకునే అవకాశమే లేదన్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా, కాంగ్రెస్ పార్టీ ప్రజామోదం పొందడం అత్యంత కష్టమేనని కేటీఆర్ స్పష్టం చేశారు.

### సర్ అత్యంత కీలకం

హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం పైన ప్రత్యేక దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచించారు. ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ నియమించిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు(బీఎల్‌వోలకు) సరైన శిక్షణ, తగిన ఏర్పాట్లు ఇవ్వకపోవడంతో మొత్తం రాష్ట్రవ్యాప్తంగా సర్ కార్యక్రమం అత్యంత మందకొడిగా సాగుతున్నదని చెప్పారు. దీనివల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫీడ్ బ్యాక్ వస్తోందన్నారు.

ముఖ్యంగా హైదరాబాద్ లాంటి అత్యధిక జనసాంద్రత ఉండే మహానగరంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫారాల పంపిణీ, వాటిలో ఓటర్ల నమోదు వంటి అంశాలపై సరైన అవగాహన లేకుండానే అధికారులను కేటాయించారని కిందటి స్థాయి నుంచి పార్టీ వర్గాలు ఇస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను కేటీఆర్ ప్రస్తావించారు. అయితే సర్ అత్యంత కీలకమైన అంశమని.. ‘ఒక వ్యక్తికి ఒకే ఓటు’ ఉండాలన్న రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు.

ఒకవైపు మొన్నటికి మొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించి ఉపఎన్నికల సందర్భంగా భారీగా బయటపడిన డబుల్ ఓట్లు, దొంగ ఓట్ల వ్యవహారాన్ని ప్రతి ఒక్క నాయకుడు గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్‌కు సంబంధించి పార్టీ నియమించు కున్న బూత్ లెవెల్ అసిస్టెంట్ల(బీఎల్‌ఏ) సహకారంతో ఏ ఒక్కరి ఓటు కూడా పోకుండా చూడాలన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్నందువల్ల డబుల్ ఓట్ల నమోదు లేదా ఇతర ప్రాంతాల వారిని ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారుల ఓట్లు పోయేలా ప్రయత్నం చేసే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలని, ఏ ఒక్కరి ఓటు అన్యాయంగా తొలగించబడకుండా చూడాలన్నారు. దీంతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న డబుల్ ఓట్ల పైన పార్టీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు.

# గిరిజనులకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి





● సాంకేతిక సేవలను ప్రజలక చేరవేయాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూలై 9**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల జోన్‌లోని మాదారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు మంచిర్యాల జోన్ డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య,ఎస్ఐ సౌజన్య పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం,పలికారు.అనంతరం సాయుధ దళ పోలీసుల గౌరవ వందనాన్ని పోలీస్ కమిషనర్ స్వీకరించారు. తదనంతరం స్టేషన్ పరిసరాలు,వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, పోలీస్ స్టేషన్ ఆవరణలోని క్రీడా ప్రాంగణం, పోలీస్ వాహనాల నిర్వహణను పరిశీలించారు. ప్రతి పోలీస్ వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, ట్రాఫిక్ కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ (హెల్మెట్, స్టోన్ గార్డ్, లాఠీ, బాడీ ప్రొటెక్టర్) తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమ్యూనికేషన్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం అందినప్పుడు కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తత, స్పందన తీరు ఎలా ఉందో కమ్యూనికేషన్ సెట్ ద్వారా మాట్లాడి తెలుసుకున్నారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు,ఓ రౌడీషీటర్లు, అనుమానితుల వివరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ సంబందించిన పూర్తి రికార్డ్స్ ,పెండింగ్ కేసులు ,తదితర వివరాలను ఎస్ఐ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బందితో మాట్లాడి వారి విధులు, ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.విస్తారమైన గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సేవలందిస్తున్న మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మరింత స్నేహపూర్వకంగా, అందుబాటులో ఉండే పోలీసింగ్ అందించాలని సూచించారు. గిరిజనులతో సున్నితంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను అర్థం చేసుకుని విశ్వాసాన్ని పెంపొందించాలని ఎస్ఐ, సీఐలకు ఆదేశించారు. పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక సేవలు, సీసీటీఎన్ఎస్,హాక్ ఐ, టీఎస్ కాప్ వంటి యాప్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.అలాగే పాస్‌పోర్ట్ ధృవీకరణ, వివిధ ధ్రువపత్రాల జారీ,ఫిర్యాదుల స్వీకరణ వంటి ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. యువతకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక,రూపొందిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యంతో అమలు చేయాలని సూచించారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు,యువత, తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అలాగే సీసీ కెమెరాల ఏర్పాటు,వాటి ప్రయోజనాలు, ప్రాముఖ్యత,సైబర్ నేరాల నివారణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ ఎస్ఐలు తమ పరిధిలో విజిబుల్ పోలీసింగ్,పెట్రోలింగ్, ఆకస్మిక వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించి నేరాల నియంత్రణతో పాటు ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. భారీ వర్షాలు,ప్రకృతి వైపరీత్యాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక (ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్) సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

**పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటిన సిపి**

మాదారం పోలీస్ స్టేషన్ నిర్వహణ,సౌకర్యాలు,పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ ఎస్ఐ, సీఐతో పాటు స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.



## సంగెంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**కోరుట్ల జూలై 09 (ప్రజాతీర్పు)**

సంగెం గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ చీటి స్వరూప వెంకట్రావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పలువురు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించి, పనులు నాణ్యతగా మరియు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన ముంజ భాగ్య లింభయ్య ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులను చీర, సారెతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధవేణి మహేష్ గౌడ్, గ్రామ కార్యదర్శి శేఖర్, వార్డు సభ్యులు బొలుమల్ల నరేష్, వల్లకొండ శ్రీహరి, చింతకింది భాస్కర్, తుదిగేని రోహిణి, వల్లకొండ గౌతమి, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్స్ పోగొట్టుకున్న పోలీస్ కానిస్టేబుల్. దొరికితే అప్పగించాలని విజ్ఞప్తి

**నర్సంపేట, జూలై 09, ప్రజా తీర్పు ప్రతినిధి:**

వరంగల్ జిల్లా నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ భూక్యా మౌలాల్ (రాజ–75) తన పర్సు పోగొట్టుకున్నారు. ఈ నెల 1వ తేదీన నర్సంపేట పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వైపు వెళ్తుండగా వెనుక జేబులో ఉన్నపర్సుజారిపడిపోయినట్లు తెలిపారు. ఆ పర్సులో పోలీస్ ఐడీ కార్డు సహా ఇతర ముఖ్యమైనపత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎవరికైనా ఆ పర్సు దొరికితే సమీపంలోని పోలీస్ .స్టేషన్‌లోఅప్పగించాలనీ లేదా 9866443492, 8712544195 నంబర్లకు సంప్రదించాలని భూక్యా మౌలాల్ విజ్ఞప్తి చేశారు.


AFFIDAVIT

## అరుణాచలం ప్రత్యేక టూర్ ప్యాకేజీని విజయవంతం చేసిన డ్రైవర్లకు ఘన సన్మానం




**నర్సంపేట, జూలై 09, ప్రజా తీర్పు ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక టూర్ ప్యాకేజీలో భాగంగా నర్సంపేట డిపో నుండి నిర్వహించిన అరుణాచలం ఆధ్యాత్మిక యాత్రను సురక్షితంగా, క్షేమంగా మరియు విజయవంతంగా పూర్తి చేసిన డిపో డ్రైవర్లు శ్రీ అశోక్ రెడ్డి గారు మరియు శ్రీ తిరుపతి గారిని డిపో మేనేజర్ ఎం. సరస్వతి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా యాత్ర నుండి తీసుకొచ్చిన తీర్థ ప్రసాదాన్ని డిపో మేనేజర్ కిఅందజేశారు. అనంతరం డిపో మేనేజర్ సరస్వతి మాట్లాడుతూ, ౧+టూ=౨జ నర్సంపేట డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధ్యాత్మిక టూర్ ప్యాకేజీలను నర్సంపేట ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకొని సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించాలని కోరారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక టూర్ ప్యాకేజీలనుఅందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

## సింగరేణి హక్కుల కోసం చేసిన పోరాటానికి ఫలితం దక్కింది

### పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ గడ్డం

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 9**



సింగరేణి సంస్థ హక్కుల పరిరక్షణ కోసం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీ కృష్ణ గడ్డం అన్నారు. ఎన్నికల ప్రచార సమయం లోనే తెలంగాణ మంత్రి డా. జి.వివేక్ వెంకటస్వామి తో కలిసి సింగరేణి సంస్థకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పామని, సింగరేణి ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో పోరాడతామని హామీ ఇచ్చామని ఆయన గుర్తు చేశారు.ఆ హామీకి అనుగుణంగానే గత రెండు సంవత్సరాలుగా సింగరేణి సంస్థకు హక్కుగా రావాల్సిన కోల్ బ్లాక్‌ల కేటాయింపుపై నిరంతరం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చామని తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి శ్రీ కిషన్ రెడ్డి,ని పలుమార్లు కలిసి తాడిచెర్ల కోల్ బ్లాక్ 2ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్,సీ,ఎల్)కు కేటాయించాలని విజ్ఞప్తి చేశామని, అదే అంశంపై పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తి సింగరేణి కార్మికుల గొంతుకగా నిలిచామని పేర్కొన్నారు.ఈ రోజు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల కోల్ బ్లాక్ 2ను సింగరేణికి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన వంశీ కృష్ణ గడ్డం, ఇది సింగరేణి సంస్థకు మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కూడా ఎంతో కీలకమైన నిర్ణయమని అన్నారు.ఈ కేటాయింపుతో సింగరేణి సంస్థ బలోపేతం కావడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని తెలిపారు.ఇది కేవలం కోల్ బ్లాక్ కేటాయింపు మాత్రమే కాదు.సింగరేణి కార్మికుల పోరాటానికి దక్కిన విజయం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవం. సింగరేణి హక్కులు, కార్మికుల సంక్షేమం కోసం మా పోరాటం భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధతతో కొనసాగుతుంది. అని పెద్దపల్లి ఎంపీ శ్రీ వంశీ కృష్ణ, స్పష్టం చేశారు.



## సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ భద్రతపై బెల్లంపల్లిలో సంయుక్త అవగాహన కార్యక్రమం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 9**

ప్రజల భద్రత,నేరాల నియంత్రణ,సురక్షిత రవాణా లక్ష్యంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో బుధవారం సాయంత్రం 5.00 గంటల నుంచి 7.00 గంటల వరకు కాంటా చౌరస్తా నుంచి ఓల్డ్ బస్టాండ్ వరకు అధికారులు కాలినడకన పర్యటిస్తూ వ్యాపార సంస్థల యజమానులను కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యాపార సంస్థల యజమానులు తమ దుకాణాల వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల ద్వారా నేరాల నివారణ, నేరస్తుల గుర్తింపు, వ్యాపార సంస్థల భద్రత మరింత బలోపేతం అవుతుందని వివరించారు.అదే విధంగా ట్రాఫిక్ నిబంధనల పాటింపు, రహదారి భద్రత, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.బెల్లంపల్లి పట్టణంలోని యూ–టర్న్‌ల వద్ద వాహనాలను ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడపాలని,నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజల సహకారంతోనే సురక్షిత, నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.ప్రతి వ్యాపార సంస్థలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం,ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్,మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి,బెల్లంపల్లి టూ టౌన్ ఎస్ఐ,తాండూర్ ఎస్ఐతో పాటు పోలీసు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## మైనార్టీ నేత గౌస్ భాయ్ ఆధ్వర్యంలో వై ఎస్సార్ జన్మ దిన వేడుకలు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 9**

ఉమ్మడిఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో మైనార్టీ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఎండీ గౌస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దొంగల మల్లేష్ కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎం డీ అఫ్జల్ లు వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. పేదల వైద్యం కోసం ఆరోగ్యశ్రీ,108 అంబులెన్స్ ల ఏర్పాటు పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజల్లో వైయస్ జగన్ ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకెనపల్లి సర్పంచ్ సుదమల్లవెంకటి, మాజీ సర్పంచ్ జమ్మిడి బానయ్య, మాజీ కౌన్సిలర్ పోట్ల సురేష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ధర్ని సత్యనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆడెపు మహేష్ ,మొండి, దుర్గం దశరయ్య,పెద్ది శ్రీనివాస్, యాకూబ్ మహమ్మద్, యూత్ కాంగ్రెస్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ సాయికిరణ్, జమా మజీద్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మీర్జా మెహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ ఎల్ ఎన్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్...

**( గుండేటిరాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 9.**



జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో గురువారం జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ ఎల్ ఎన్ ) కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ నిర్వహించారు. జిల్లాలో విద్యార్థుల ఫలితాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ ఎల్ ఎన్) అమలుపై నిర్వహించిన సమావేశంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. పదో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు కూడా కనీస అభ్యాస సామర్థ్యాలను సాధించలేకపోతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియలపై సంపూర్ణ పట్టు కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు మాసవారీ లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి నెలా వాటి పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఉత్తమ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి నెలా అభినందించి ప్రోత్సహిస్తామని, తక్కువ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులతో నేరుగా సమావేశమై సమస్యలను గుర్తించి, అభ్యాస ఫలితాలు మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జగిత్యాల జిల్లా పీజీఐలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని, అయితే గత విజయాలతో సంతృప్తి చెందకుండా ఫలితాలను మరింత మెరుగుపరచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి గ్రేడ్‌కు తగిన చదువు సామర్థ్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సింగిల్ టీచర్ పాఠశాలలు, మల్టీగ్రేడ్ తరగతులు, తక్కువ హాజరు, బోధనా సామగ్రి వినియోగంలో లోపాలు, రెమెడియల్ టీచింగ్ అవసరం వంటి సవాళ్లను గుర్తించి వాటిని సమిష్టిగా అధిగమించాలని సూచించారు. ప్రతి నెల ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యాలు నిర్దేశించుకుని, పాఠ్యపుస్తకాలు, టీచర్ హ్యాండ్‌బుక్, విద్యార్థుల వర్క్‌బుక్ మధ్య సమన్వయంతో బోధన సాగించాలని తెలిపారు. బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ అంచనాల ద్వారా విద్యార్థుల పురోగతిని నిరంతరం పరిశీలించి, అంచనాల ఫలితాలను కార్యాచరణ ప్రణాళికలుగా మార్చాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రెమెడియల్ బోధన అందించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, సాంప్రదాయ బోధనకు బదులుగా భావనాత్మక, సృజనాత్మక, కార్యకలాపాల ఆధారిత, విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి నెల ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ పాఠశాలలు, వినూత్న బోధనా విధానాలను గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాల సముదాయాలను అకాడమిక్ లెర్నింగ్ కమ్యూనిటీలుగా అభివృద్ధి చేసి, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, అకాడమిక్ బృందాలు నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. అలాగే, 100 శాతం లక్ష్యాలను సాధించిన పాఠశాలలను స్వయంగా సందర్శించి, ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. విద్యార్థుల్లో కనీస అభ్యాస సామర్థ్యాల పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేయాలని, నాణ్యమైన బోధన ద్వారా జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి కె.రాము, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్పీలు అభయ్ రాజ్, విజయ్, జయంత్, ప్రవీణ్, మహేష్, ఉమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారముల ఆన్ లైన్ వెంట వెంటనే పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 09(ప్రజాతీర్పు ):**

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం బాసర, తానూర్, కుబీర్, మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా బాసర గ్రామపంచాయితీ ఆవరణలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా ఎస్ఐఆర్ ఫారముల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారంలను పూరించుటలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎస్ఐఆర్ విషయంలో సహాయం చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.అనంతరం తానూరు మండలం సింగన్ గావ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం పంపిణీ చేసిన ఫారములు, ఇప్పటివరకు, తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తి చేసిన డిజిటలైజేషన్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కుబీర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను



పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారములు నింపుటలో ఓటర్లకు సహాయం చేయాలని బిఎల్ఓ లకు అధికారులకు సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన డిజిటలైజేషన్ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్ లో వివరాలను పరిశీలించారు. సమీపంలోని ఓటర్ ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేశారో లేదో అడిగి తెలుసుకున్నారు. తనిఖీలలో తహసిల్దార్లు పవన్ చంద్ర, మహేంద్రనాథ్, శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ లు వెంకటేష్ గౌడ్, అన్నపూర్ణ, సాయినాథ్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రాజస్థాన్ హత్యాచార నిందితులను నడిరోడ్డుపై ఉరితీయాలి

### సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న.

**(పగడాల రామారావు ప్రజాతీర్పు గార్ల మండల ప్రతినిధి) జూలై 9**

గార్ల. రాజస్థాన్ రాష్ట్రంలో 13 సంవత్సరాల మైనర్ బాలికపై 32 మంది మృగాళ్ల దాడిని తీవ్రంగా ఖండించిన స్థానిక సిపిఐ మండల కార్యదర్శిజంపాల వెంకన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలో 13 సంవత్సరాల మైనర్ బాలికను 32 మంది కీచకులు కిడ్నాప్ చేసి, ఐదు రోజుల పాటు బంధించి, అత్యంత అమానుషంగా గ్యాంగ్ రేప్ చేసి హతమార్చిన ఘాతుకాన్ని నిరసిస్తూ స్థానిక మండల కేంద్రంలో నిరసన కార్యక్రమ నిర్వహించారుఈ పాశవిక చర్యకు పాల్పడిన నరరూప రాక్షసులను తక్షణమే సభ్య సమాజం ముందు ఉరితీయాలని డిమాండ్ చేశారు.. దేశంలో మహిళలు, మైనర్ బాలికలపై రోజురోజుకూ పెరుగుతున్న లైంగిక దాష్టీకాలు, హత్యాచారాలు సమాజానికే శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలు ఎన్ని ఉన్నా మృగాళ్లలో భయం కలగడం లేదని, 32 మంది కలిసి ఒక చిన్నారిని బలితీసుకోవడం మానవత్వానికే తీరని మచ్చ అని మండిపడ్డారు. ఈ కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా తక్షణ విచారణ జరిపి, నిందితులకు నడిరోడ్డుపై ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాగం రమేష్, మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్య హరినాయక్, మాగం లోకేష్, రాజేష్, రాంబాబు, ఉపేందర్, మల్లేశం, రాములు, ఉదయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 09(ప్రజాతీర్పు ):**

నిర్మల్ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, అధిక రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. ప్రత్యేకంగా నిర్మల్ బస్టాండ్ పరిసరాలు, ఆటో స్టాండ్, అంబేద్కర్ చౌక్, మయూరి హోటల్ సమీపం, కిసాన్ షాపింగ్ మాల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలు, రహదారులపై వ్యాపారం నిర్వహిస్తున్న చిరు వ్యాపారులతో చర్చించి ట్రాఫిక్ సజావుగా సాగేలా అవసరమైన చర్యలుతీసుకొంటున్నారు. అలాగే రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నివారించి వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఆర్ఐలు రామ్ నిరంజన్, రామక్రిష్ణ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమం రేపటి నుంచి అమల్లోకి వస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని, రహదారులను ఆక్రమించకుండా సహకరించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల విజ్ఞప్తి చేశారు.



## నర్సంపేట తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి.

**నర్సంపేట మండలం 09 జూలై 2026 (ప్రజా తీర్పు న్యూస్ )**

నర్సంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల మరియు జూనియర్ కళాశాల ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీ పాల్ రెడ్డి సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖలో సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు కీలకమైనవని మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తూ మారుమూల గ్రామాలలోని పేద విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. తాను ముందుండి గౌరవ ముఖ్యమంత్రి గారికి సమయసారిని మార్చవలసిన ఆవశ్యకతను వివరించి అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఉత్తర్వులు ఇప్పించడం జరిగిందని తెలియజేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పి ఆర్ సి మరియు పెండింగ్ డీఎలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే విధంగా ప్రయత్నం చేస్తానని ,సంక్షేమ గురుకులాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ అధ్యాపకుల బదిలీలు మరియు ప్రమోషన్లు త్వరలో జరిగే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు రవీందర్ రెడ్డి మహేందర హనుమకొండ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రాష్ట్ర బాధ్యులు రెడ్డి గారు రఘు నర్సంపేట అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాంబయ్య మల్లయ్య ,పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సంగెపు కుమారస్వామి ఉపాధ్యాయ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## భర్త హత్య కేసు: భార్య అరెస్టు

### ఘటన వివరాలు వెల్లడించిన మెట్పల్లి డీఎస్పీ

**కోరుట్ల జూలై 09 (ప్రజాతీర్పు)**



కోరుట్ల పట్టణంలోని అల్లమయ్యగుట్టలో జరిగిన భర్త హత్య కేసును కోరుట్ల పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మృతుడి భార్య రజినిని అరెస్టు చేసినట్లు మెట్పల్లి డీఎస్పీ ఏ. రాములు వెల్లడించారు.గురువారం కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ,అల్లమయ్యగుట్టకు చెందిన ఇప్ప కాశిరాం (35)కు రజినితో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని తెలిపారు.గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మద్యం సేవించడం, కుటుంబ కలహాల కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్త తనను, పిల్లలను తరచూ వేధించేవాడని భావించిన రజిని, అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. సుమారు 20 రోజుల క్రితమే కర్రతో దాడి చేయగా, స్థానికులు అడ్డుకుని కాశిరాంను ఆసుపత్రికి తరలించడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడని తెలిపారు.ఈ నెల 8వ తేదీ రాత్రి కాశిరాం మద్యం సేవించి ఇంటికి రాగా, ముందుగానే పిల్లలను తన తల్లి ఇంటికి పంపిన రజిని ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగిందని, అనంతరం రాత్రి సుమారు 11:45 గంటలకు ఇంట్లో ఉన్న రోకలిబండతో కాశిరాం తలపై బలంగా దాడి చేయడంతో తీవ్ర గాయాల కారణంగా అక్కడికక్కడే మృతి చెందినట్లు డీఎస్పీ వివరించారు.హత్య అనంతరం రజిని అక్కడి నుంచి పారిపోయి అయ్యప్పస్వామి ఆలయం వెనుక ఉన్న బంధువుల వద్ద తలదాచుకుందని తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు కోరుట్ల సీఐ, ఎస్ఐ మరియు వారి సిబ్బంది నిందితురాలిని అదుపులోకి తీసుకుని, హత్యకు ఉపయోగించిన రోకలిబండను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సాంకేతిక ఆధారాలను వినియోగించి కేసును త్వరితగతిన ఛేదించిన కోరుట్ల సీఐ, ఎస్ఐ మరియు పోలీసు సిబ్బందిని మెట్పల్లి డీఎస్పీ ఏ.రాములు అభినందించారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి బిజెపిపార్టీలోకి చేరిక

**నర్సంపేట జూలై 9 ప్రజా తీర్పు**

నర్సంపేట నియోజకవర్గం,నల్లబెల్లి మండలం ముచ్చింపుల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఊటుకూరి రాజు , బోనగాని ధర్మయ్య బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ అధ్యక్షతన బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో మండల ఉపా ధ్యక్షుడు బత్తిని కుమారస్వామి ,ముచ్చింపుల గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారం క్రాంతికుమార్ ,మండల నాయకులు కక్కెర్ల సురేష్ , సమయ్య ,ములుక రాజేష్ , యువ మోర్చా నాయకులు తిమ్మాపురం శివ , కొత్తపెల్లి మధుకర్ పాల్గొన్నారు.





## వేములవాడలో సీజనల్ వ్యాధుల నివారణకే స్పెషల్ డ్రైవ్: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- కోరుట్ల బస్టాండ్ నుంచి చెక్కపల్లి బస్టాండ్ వరకు ముమ్మరంగా డ్రైనేజీ పూడికతీత

**( కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) జులై 9 :**

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ మున్సిపల్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ నుండి చెక్కపల్లి బస్టాండ్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మోరిల పూడికతీత పనులను ముమ్మరంగా చేపట్టారు. గురువారం స్థానికంగా జరుగుతున్న ఈ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందకుండా, తద్వారా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో డ్రైనేజీలు, మోరిలలో నీరు సాఫీగా సాగిపోయేలా పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని, ప్రజారోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిరుపయోగంగా ఉన్న పాత్రలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ?ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## అర్హులంతా ఎన్యూమరేషన్ ఫారం నింపాలి: డా. అనుప్ రావు

**కోరుట్ల జూలై 09 (ప్రజాతీర్పు)**

కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట్, చిన్న మెట్పల్లి, యూసుఫ్‌నగర్ గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుప్ రావు మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన ఓటరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియపై ఎలాంటి అపోహలకు తావు లేకుండా ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని సూచించారు.ఓటరు జాబితా నుంచి కేవలం అనర్హులైన వారి పేర్లు మాత్రమే తొలగించబడతాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపి స్థానిక బి ఎల్ ఓ లకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కోరుట్ల నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ కన్వీనర్ వడ్డపెల్లి శ్రీనివాసన్, జిల్లా సర్ కన్వీనర్ పుప్పాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల తుకారం గౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, కోరుట్ల మండల అధ్యక్షుడు పంచిరి విజయ్ కుమార్, బి ఎల్ ఎ2 మండల ప్రభారి బొలిశెట్టి రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి గోపు ప్రశాంత్, కోరుట్ల పట్టణ కార్యదర్శి ఎర్ర రాజేందర్, మండల నాయకులు శంకు నరేందర్, ప్రసాద్, నాగేంద్ర, దామోదర్, నాగేశ్వర్ రావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలి

- సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గార్ల మండల కార్యదర్శిజి సక్రు.

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) జూలై 9**




గార్ల. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి ఇల్లు ఇవ్వకుండా వారి పార్టీకి సంబంధించిన వారికి మాత్రమే ఇల్లు ఇస్తున్నారని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ స్థానికమండల కార్యదర్శి జి సక్రు అన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు కూడా పట్టాలిస్తామని ఎన్నికల్లో చెప్పిన వాగ్దానాన్ని విస్మరించి నేటికీ పాలకులు వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వకపోవడం విచారకరం. గురువారంన్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు నిర్మించాలని అలాగే పోడు భూముల పట్టాలు ఇవ్వాలని గిరిజన గ్రామాల్లో సందర్శించడం జరిగింది అనంతరం సక్రు మాట్లాడుతూ పేదలకు కనీసం చిన్నపాటి ఇల్లు కూడా ఉండకూడదా, దేశంలో అందరికీ ఇల్లు నిర్మించి ఇస్తానని వాగ్దానం చేసిన ప్రధాని మోడీ ప్రజలను దారుణంగా మోసం చేశారని ఇక్కడ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఆయా వర్గాలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ బిజెపి లాగానే జనాలను వంచిందని ఆయన అన్నారు. ఈ మండలంలో కూడా అనేక చోట్ల అనేక గ్రామాల్లో అర్హులైన వారికి కూడా ఇల్లు ఇవ్వకపోవడం విచారకరం, ముఖ్యంగా చిన్న కిష్టాపురం, గార్ల,గ్రామాలలో సర్వేలు నిర్వహించడం జరిగింది. తక్షణమే అర్హులైన వారికి ఇళ్లతో పాటు పోడు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించిన సుబ్బారావు

**నర్సంపేట జూలై 9 ప్రజా తీర్పు**

వరంగల్ జిల్లా ఆట్యా పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిన్న మినీ స్టేడియం నర్సంపేటలో నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి అండర్ -14 సంవత్సరాల ఆట్య పాట్యా క్రీడా సెలక్షన్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గీతాంజలి డిజి స్కూల్ విద్యార్థులు కొండ రితిక్ చంద్, ఇల్లందుల ధనుష్ లను అభినందించిన గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులుడ చైర్మన్ డా,,వేములపల్లి సుబ్బారావు.. ఈ సందర్భంగా డా,, వేములపల్లి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో కూడా ముందుకు వెళ్లాలని అన్ని రంగాల్లో విద్యార్థులు అభివృద్ధి చెందే విధంగా విద్యను అందిస్తున్నామని తెలిపారు.. ఈ యొక్క కార్యక్రమంలో గీతాంజలి డిజి స్కూల్ వైస్ ప్రిన్సిపల్ సింహాద్రి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు యాట రవికుమార్, వర్స అఖిల, రజిని కుమార్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు...

## యువకుడి ఆత్మహత్య

**(నారు కట్ల మధు రాజన్న సిరిసిల్ల ప్రజా తీర్పు ) జులై 9**



ఈరోజు అనగా తేదీ 9 7 26 రోజున రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల సుజాత భర్త నరసయ్య 48 సంవత్సరాలు కులం ముదిరాజ్ అను ఆమె పోలీస్ స్టేషన్కు వచ్చి దరఖాస్తు ఇచ్చిన విషయం ఏమనగా తన కొడుకు అయిన రాగుల స్వామి తండ్రి నరసయ్య వయసు 27 కులం ముదిరాజ్ అను అతను గత మూడు సంవత్సరాల క్రితం దుబాయ్ నుండి తిరిగి వచ్చి అప్పటి నుండి ఎలాంటి పనులు చేయకుండా అనవసరంగా అటు ఇటు తిరుగుతూ మద్యానికి బానిసై డబ్బులు వృధాగా ఖర్చు చేస్తున్నాడు. అంతేకాకుండా ఆరు నెలల క్రితం సిరికొండ వద్ద బైక్ యాక్సిడెంట్ కాగా కుడికాలు విరిగి ఆపరేషన్ జరిగిందని అయినా మారకుండా అదే విధంగా మద్యం సేవించగా ఫిర్యాదురాలు తన కొడుకును మద్యం సేవించవద్దని ఆరోగ్యం పాడైపోతుంది ఎన్నిసార్లు చెప్పినా వినకపోలేదు. ఇట్టి క్రమంలో నిన్న అనగా తేదీ 8 7 26 రోజున రాత్రి 8:30 గంటలకు ఫిర్యాదులు కొడుకు ఇంటికి తిరిగి రాగా ఫిర్యాదురాలు అతన్ని ఎందుకు అనవసరంగా బయట తిరుగుతున్నా వని ఏదైనా పని చేసుకోమని సూచించడం జరిగింది. దీంతో మనస్థాపన చెంది ఫిర్యాదు రాదు ఇంట్లో ఉన్న బెడ్ రూమ్ లో చీరతో దూలానికి ఉరివేసుకొని మరణించడం జరిగిందని ఫిర్యాదు చేయగా రుద్రం ఎస్సై మధురం గారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశాడు తెలపడం జరిగింది.

## అనుపురంలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు బీహార్ కూలీల దుర్మరణం



**(నారుకట్ల మధు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజా తీర్పు) జులై 9**

వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన పలువురు వలస కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరికొందరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ?స్థానికులు మరియు పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు పనుల నిమిత్తం వాహనంలో వెళ్తుండగా, అనుపురం వద్దకు రాగానే ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో ఘటనా స్థలంలోనే కూలీలు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. ?ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వేములవాడ పోలీసులు, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## వైద్య విద్య నిమిత్తంకే ఎంసికి దేహ దానం

**నర్సంపేట జూలై 9 ప్రజా తీర్పు**



వరంగల్ ,నల్లబెల్లి మండల్ శనిగరం గ్రామ వాసి జిల్లా రైతు సంఘము నాయకుడు కడియాల వీరాచారి 69 ఈరోజు8/7/2026 న మరణించగా, వారి కుమారుడు జయప్రసాద్ మరియు కుటుంబసభ్యుల సహకారంతో సమాజ హితం కోరి, వైద్య చదువుల నిమిత్తం, మెడికల్ కాలేజీ కిదేహదానం చేయుటకు అంగీకరించారు, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీ అనాటమీ విభాగానికి అప్పగించడమైనది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ దాస్ గారికీ, అనాటమీ విభాగపతి డాక్టర్ శశికాంతా కీ అనాటోమీ డాక్టర్స్ ఉమారాణి, జ్యోత్స్న, మౌనిక, అన్వర్, సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణవ్ కు అప్పగించనైనది. ఈ కార్యక్రమం లో బంధుమిత్రులు పాల్గొన్నారు. తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఈశ్వర్ లింగం, రాష్ట్ర ఉపాధక్షురాలు మునిగాల పద్మ వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, సెక్రటరీ సురేందర్, హనంకొండ ఉపాధ్యక్షులు కడారి శ్రీనివాస్, సలహాదారులు భారతి కూరాకుల, విజయకుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారూ.

# ఆరోపణలు కాదు.. ఆధారాలు చూపెట్టండి

- 1979లో పట్టా చేసుకున్న మేము కబ్జాదారులమా..?
- 2012లో లేని భూమిని అక్రమంగా పొందిన మీరు కబ్జాదారుల?
- ఎలిగేడు సర్వే నం.226లో 18 గుంటల భూమి రిజిస్ట్రేషన్‌పై సమగ్ర విచారణ జరపాలి

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) , జూలై 9:**



అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 18 గంటల భూమి మీకు ఏ విధంగా వచ్చిందో ఆధారాలు చూపెట్టకుండా, ఆరోపణలు చేయడం సిగ్గుచేటని రైతులు మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..1979 లో పట్టా చేసుకున్న మేము కబ్జాదారులమ అవుతామా? 2012 లో లేని భూమిని అక్రమంగా పొందిన మీరు కబ్జాదారుల అని ప్రశ్నించారు. ముంజంపల్లి లింగమూర్తి ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని, తమ వద్ద ఉన్న అధికారిక ధ్రువీకరణ పత్రాల ఆధారంగా సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ భూములు, ప్రభుత్వ నిధులకు నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వారి కథనం ప్రకారం, సర్వే నంబర్ 226లో మొత్తం 11 ఎకరాల 20 గుంటల భూమి ఉండగా, అందులో 32 గుంటలను ఆర్అండ్‌బీ రోడ్డు కోసం, మరో ఎకరం 18 గుంటలను ఎస్ఆర్ఎస్పీ కాలువ, ఫీడర్ ఛానల్ నిర్మాణానికి ప్రభుత్వం గతంలోనే స్వాధీనం చేసుకుందని తెలిపారు. మిగిలిన 9 ఎకరాల 10 గుంటల భూమిని తమ తండ్రి సింగిరెడ్డి మల్లారెడ్డి 1979లో చట్టబద్ధంగా కొనుగోలు చేసి అప్పటి నుంచి సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే నంబర్ 226లో ఎలాంటి మిగులు భూమి లేకపోయినా, 2012లో 18 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి, అనంతరం 2015లో అదే భూమిని ముంజంపల్లి లింగమూర్తి పేరిట నమోదు చేశారని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన అధికారిక రికార్డుల్లో కూడా సర్వే నంబర్ 226లో మిగులు భూమి లేదని స్పష్టంగా ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన విచారణలో లింగమూర్తి పేరును రికార్డుల నుంచి తొలగించినప్పటికీ, అనంతరం 226/దీ/1 పేరుతో తిరిగి నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సింగిరెడ్డి రామచంద్రారెడ్డి, కోటిచింతల మురళీధర్ రావు, తాటికొండ అనిల్, భీం సేన్ గొడిసేలా తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భీమేశ్వర సదన్‌లో నూతన “సరళ నిలయం” అతిథి గృహానికి శంకుస్థాపన

**(నారుకట్ల మధు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజా తీర్పు) జులై 9**

వేములవాడ, జూలై 9: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధమైన శ్రీ భీమేశ్వర సదన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న “సరళ నిలయం” అతిథి గృహానికి గురువారం వేదమంత్రోచ్చారణల నడుమ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ అతిథి గృహ నిర్మాణానికి మాజీ పార్లమెంట్ సభ్యులు మాజీ మంత్రి, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు గారు,మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ గారు ఏకశిల ఏద్యుకేషన్ సొసైటీ వరంగల్ వారు దాతలుగా సహకరిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో గతంలో 2007 మార్చి 28న తొలి అతిథి గృహం నిర్మించగా, ప్రస్తుతం దాని పైభాగంలో భక్తుల వసతి సౌకర్యాలను మరింత విస్తరించే లక్ష్యంతో మరో నూతన అతిథి గృహాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన అతిథి గృహానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దాతలు, వారి కుటుంబ సభ్యులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ గారు దాతలను శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం, కండువాతో ఘనంగా సత్కరించారు. నూతనంగా నిర్మించనున్న “సరళ నిలయం” అతిథి గృహం పూర్తయిన అనంతరం వేములవాడకు విచ్చేసే భక్తులకు మరింత మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.



## రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం

**నిజాంసాగర్/ జులై 9( ప్రజా తీర్పు)**

నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావుపల్లి గ్రామంలో మాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘం రాష్ట్ర నాయకులు అయ్యల సంతోష్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన ఎస్సీ వర్గీకరణ కారణంగా మాల విద్యార్థులు, నిరుద్యోగ యువత విద్యా, ఉద్యోగ అవకాశాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని వెంటనే మార్చాలని లేదా సవరించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్ల ఫలాలు ప్రతి అర్హుడికి సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో మాలలందరూ రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమిస్తేనే తమ హక్కులను సాధించుకోగలమని, అంబేద్కర్ ఆశయాలను పరిరక్షించగలమని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లింగమయ్య, సాయిలు, నాగేష్, గైని సాయిలు, ప్రకాష్, కాశీరం, సామియెల్, విట్టల్, రాజయ్య, రత్నవ్వ తదితరులు పాల్గొన్నారు.



## చెంగిచెర్లలో ఘనంగా విలేజ్ టీ స్టాల్ ప్రారంభోత్సవం

**బోడుప్పల్ సర్కిల్ ,జులై 09, ( ప్రజాతీర్పు )**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్లలో విలేజ్ టీ స్టాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, చెంగిచెర్ల డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ పాల్గొని టీ స్టాల్ యాజమానులు బానోతు నరేందర్ నాయక్, ఏ.శ్రీకాంత్ కు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు రుచికరమైన టీ ని అందించి వ్యాపార రంగంలో దినదిన అభివృద్ధి చెందాలని, వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ రాజు నాయక్, రావిఫడ్ తండా సర్పంచ్ శంకర్ నాయక్, అనిల్ నాయక్,సిద్దు మరియు పలువురు నాయకులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సీలింగ్ భూముల జోలికొస్తే కఠిన చెర్యలు తప్పవు

- కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు, కిసర, మేడ్చల్ జిల్లా) జులై 09**



కీసర మండల పరిధిలోని సర్వే నంబర్ 87/2లో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూముల్లో కొందరు నిర్మాణాలు చేపడుతున్నారని, ప్లాట్లు, ఇళ్ల పేరుతో అమాయక ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ‘టైమ్స్ న్యూస్ గతంలో ప్రభుత్వ సీలింగ్ భూమిపై భారీ ఆక్రమణలు?ప్రభుత్వ సీలింగ్ భూమిపై కబ్జాలు. చర్యలు ఎక్కడ? అనే శీర్షికలతో ప్రత్యేక కథనాలను ప్రచురించింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ ఎవరి బాధ్యత? భారీ నిర్మాణాలు పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారు? ప్రభుత్వ సీలింగ్ భూమిలో నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలను కథనాల ద్వారా అధికారుల ముందుంచింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని, ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలని, అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని ‘ప్రజా తీర్పు” “దినపత్రిక “ ప్రజల తరపున కోరింది. వరుస కథనాల అనంతరం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి కూల్చివేత చర్యలకు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం జేసీబీల సహాయంతో నిర్మాణ దశలో ఉన్న నాలుగు భవనాల భారీ ఆర్‌సీసీ స్లాబులను కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో భవనాల పైకప్పులు, మెట్ల నిర్మాణాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. గతంలో పూర్తి స్థాయిలో కనిపించిన భారీ నిర్మాణాలు అధికారుల చర్యల అనంతరం కూలిపోయిన దృశ్యాలు ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారికి గట్టి హెచ్చరికగా మారాయి. ప్రభుత్వ భూమి ఎవరికి వ్యక్తిగత ఆస్తి కాదని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎంత భారీ నిర్మాణమైనా చర్యలు తప్పవనే సంకేతాన్ని రెవెన్యూ అధికారులు ఈ కూల్చివేతల ద్వారా ఇచ్చారని అలాగే ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేయాలనీ స్థానికులు పేర్కొంటున్నారు.

### ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు

కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి మాట్లాడుతు ప్రభుత్వ భూములను ఆక్రమించడం, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన చర్యలు కొనసాగుతాయని రెవెన్యూ అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, వాటిని కొనుగోలు లేదా విక్రయించే ప్రయత్నాలు చేసినా చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు, త్వరలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేస్తాం అని తెలిపారు.

# కొట్టుకుపోయిన 3 వేల సిలిండర్లు

### హెచ్‌పీసీఎల్ బాట్లింగ్ ప్లాంట్‌లోకి వరద

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ఒక ఎల్‌పీజీ ప్లాంట్ కూడా నీట మునగడంతో అందులోని మూడు వేల సిలిండర్లు పాతాళగంగా నదిలో కొట్టుకుపోయాయి. వేలాది సిలిండర్లు నదీ ప్రవాహంలో కొట్టుకుపోతున్న దృశ్యాలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. రాయ్‌గఢ్‌లో హెచ్‌పీసీఎల్‌కు చెందిన పాతాళగంగ ఎల్పీజీ బాట్లింగ్ యూనిట్‌కు చెందిన ప్రహరీ గోడ భారీ వర్షాలకు నేలకూలింది. భారీగా వరద నీరు యూనిట్ ప్రాంగణంలోకి చేరుకుంది. దీంతో అక్కడ నిల్వ ఉంచిన వేలాది సిలిండర్లు పాతాళగంగ, సముద్రపు ఉప్పునీటి కాలువ ఖర్పుడ క్రీక్‌లో కొట్టుకుపోయాయి. దీనిలో గ్యాస్ నింపిన సిలిండర్లు కూడా ఉన్నాయి. ఒక వంతెన సమీపంలో కొట్టుకుపోతున్న వేలాది సిలిండర్ల వీడియోలు





ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యాయి. నదీ ప్రవాహంలో కొట్టుకువచ్చిన సిలిండర్లు ఎవరికైనా లభిస్తే వాటిని వెంటనే పోలీసులు, అధికారులు, గ్యాస్ కంపెనీకి అప్పగించాలని రాయ్‌గఢ్ కలెక్టర్ కిషన్ జావ్లే పౌరులకు విజ్ఞప్తి చేశారు. కొట్టుకు వచ్చే సిలిండర్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, ఒక వేళ గ్యాస్‌తో నింపి ఉన్నా వాటిని ఉపయోగించే ప్రయత్నం చేయవద్దని ఆయన కోరారు.

# అల్వాల్‌లో భారీ ర్యాలీతో ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**(వినోద్, ప్రజా తీర్పు, ఆల్వాల్, మేడ్చల్) జూలై 09**




మేడ్చల్ జిల్లా అల్వాల్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలు, ఏబీవీపీ జెండాలతో విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు గురువారం ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారు. అల్వాల్ చౌరస్తాలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు సంస్థ ఆవిర్భావ నేపథ్యం, విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న పోరాటాలను వివరించారు. కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అదనపు ఫీజులు వసూలు చేసినా, విద్యార్థులు విద్యాపరమైన లేదా ఇతర సమస్యలను ఎదుర్కొన్నా భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఏబీవీపీ నాయకుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థులకు అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకుండా వారి తరపున గళమెత్తడం ఏబీవీపీ ప్రధాన లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడడంతో పాటు కళాశాలల్లో అదనపు ఫీజుల వసూళ్లు, మౌలిక సదుపాయాల కొరత, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. 1949 జూలై 9న అతికొద్ది మంది సభ్యులతో ప్రారంభమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేడు దేశవ్యాప్తంగా విస్తరించి ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందని నాయకులు పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి అస్సాం వరకు దేశవ్యాప్తంగా విద్యార్థులను ఐక్యం చేస్తూ విద్యార్థుల సంక్షేమం, జాతీయ ఐక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత లక్ష్యాలతో సంస్థ ముందుకు సాగుతోందని వివరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఏబీవీపీ సికింద్రాబాద్ నగర కార్యదర్శి పృథ్వీ మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ఏబీవీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కళాశాలల్లో అదనపు ఫీజుల వసూళ్లు లేదా ఇతర సమస్యలు ఎదురైతే విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. అల్వాల్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ విద్యార్థుల ఐక్యత, క్రమశిక్షణ, దేశభక్తిని ప్రతిబింబించింది. విద్యార్థుల నినాదాలతో అల్వాల్ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అల్వాల్ చౌరస్తాలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఏబీవీపీ సికింద్రాబాద్ కన్వీనర్ బాలు, నగర నాయకులు, కార్యకర్తలు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల ఐక్యత, క్రమశిక్షణ, సంక్షేమం పట్ల అంకితభావం అనే బలమైన సందేశంతో ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.



## జడ్పీహెచ్ఎస్ మాసాయిపేటలో సోహం RiA ఒకరోజు ప్రాక్టికల్ రోబోటిక్స్ వర్క్‌షాప్

**( వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) జులై 9**



సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్‌కు చెందిన రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ (=ఊూ), ాఎష్ట్రతీఎఐఅస్త్రవతీ సహకారంతో జిల్లా పరిషత్ హై స్కూల్ (్గాఞూ), మాసాయిపేటలో ఒకరోజు ప్రాక్టికల్ రోబోటిక్స్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో మొత్తం 137 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 68 మంది బాలికలు, 69 మంది బాలురు ఉన్నారు. విద్యార్థులు రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, సెన్సర్లు, మోటార్లు, సర్క్యూట్ బిల్డింగ్, సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా నేర్చుకున్నారు. రోబోటిక్ పార్ట్స్‌ను ఉపయోగించడం, సర్క్యూట్లు తయారు చేయడం ద్వారా టెక్నాలజీని నిజ జీవితంలో ఎలా ఉపయోగించవచ్చో తెలుసుకున్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి, టీమ్‌గా పనిచేసే విధానం, కొత్తగా ఆలోచించడం, సమస్యలకు పరిష్కారాలు కనుగొనే స్కిల్స్ పెరిగాయి. గత ఐదేళ్లుగా సోహం =ఊూ తెలంగాణలోని ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో ప్రాక్టికల్ రోబోటిక్స్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ విద్యార్థుల్లో టెక్నాలజీ, కొత్త ఆలోచనలపై ఆసక్తిని పెంచుతోంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆర్. మధుసూదన్ రావు , ఫిజికల్ సైన్స్ టీచర్ ఎం. రంగారెడ్డి ఈ కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి ఇలాంటి ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వర్క్‌షాప్ చివరలో రోబోటిక్స్ క్లబ్ సభ్యులకు సర్టిఫికెట్లు, రోబోటిక్ ప్రాక్టీస్ కిట్లు, =ఊూ హ్యాండౌట్లు అందజేశారు. వీటి సహాయంతో విద్యార్థులు వర్క్‌షాప్ తర్వాత కూడా ప్రాక్టీస్ చేస్తూ కొత్త ప్రాజెక్టులు తయారు చేసుకోవచ్చు. ఈ వర్క్‌షాప్‌కు సహకారం అందించిన ాఎష్ట్రతీఎఐఅస్త్రవతీకు సోహం =ఊూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. అలాగే జిల్లా అధికారులు, స్కూల్ మేనేజ్‌మెంట్, ప్రిన్సిపల్ ఆర్. మధుసూదన్ రావు గారు, ఫిజికల్ సైన్స్ టీచర్ ఎం. రంగారెడ్డి గారు, టీచింగ్ మరియు సపోర్ట్ స్టాఫ్, విద్యార్థులు, =ఊూ ట్రైనర్లకు వారి సహకారం, కృషికి ధన్యవాదాలు తెలిపింది. సహదేవ్ కొమరగిరి గారు స్థాపించిన సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఒక స్వచ్ఛంద సంస్థ. విద్యార్థులకు టెక్నాలజీ, కొత్త ఆలోచనలు, లీడర్‌షిప్ స్కిల్స్ అందించడం సంస్థ ముఖ్య లక్ష్యం. సోహం =ఊూ ఇప్పటికే తెలంగాణలోని అన్ని 33 జిల్లాలకు చేరుకుంది. అకాడమీ ఆధ్వర్యంలో సోహం లీడర్‌షిప్ ప్రోగ్రామ్ (ాఞూ), సోహం యోగా, సోహం సుస్వర కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.




## వరంగల్‌లో గర్భిణీలకు ఎనిమిది ప్రత్యేక 102 వాహనాలు

- పీఎం పాటి శివకుమార్ జిల్లా మేనేజర్ గుర్రపు భరత్

**నర్సంపేట జులై 9 ప్రజా తీర్పు**



గర్భిణీలు, బాలింతల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా వరంగల్ జిల్లాలో 102 "అమ్మఒడి" అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల మహిళలకు కూడా ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు ఈ సేవలు ఎంతో దోహదపడుతున్నాయి. జిల్లాలోని వివిధ మండలాల్లో మొత్తం 8 ప్రత్యేక 102 అమ్మఒడి వాహనాలు 24 గంటలూ సేవలందిస్తున్నాయి. గర్భిణీ స్త్రీలను ప్రసవానికి ముందు వైద్య పరీక్షలు ( అన్ టెంటల్ చెకప్ ) చేయించుకునేందుకు ఇంటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు సురక్షితంగా తరలించడం, పరీక్షలు పూర్తయిన అనంతరం తిరిగి ఇంటికి చేర్చడం, అలాగే ప్రసవానంతరం బాలింతలు, నవజాత శిశువులను తదుపరి వైద్య పరీక్షల ( పోస్ట్ నాటల్ చెక్ అప్ ) కోసం ఆసుపత్రులకు ఉచితంగా తీసుకెళ్లి తిరిగి ఇంటికి చేర్చడం వంటి సేవలను 102 అమ్మఒడి ద్వారా అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు రవాణా సమస్యలు లేకుండా సకాలంలో మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించి మాతా--శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మాతా--శిశు మరణాల రేటును తగ్గించడం ఈ సేవల ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. పీఎం పాటి శివకుమార్ మాట్లాడుతూలి , "102 అమ్మఒడి సేవలు గర్భిణీలు, బాలింతలకు ఎంతో అమూల్యమైనవి. జిల్లా నలుమూలలా ఉన్న గర్భిణీ స్త్రీలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల తల్లులు ఈ ఉచిత సేవలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలి. సమయానికి వైద్య సేవలు అందించడంలో 102 వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి" అని తెలిపారు. జిల్లా మేనేజర్ గుర్రపు భరత్ కుమార్ మాట్లాడుతూ "102 అమ్మఒడి అంటే నిజంగానే అమ్మకు లభించిన వరం. గ్రామీణ ప్రాంతాల గర్భిణీలు, బాలింతలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు, ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత వారిని సురక్షితంగా తిరిగి ఇంటి వద్దకు చేర్చే బాధ్యతను 102 సిబ్బంది అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారు. ప్రతి అర్హులైన మహిళ ఈ సేవలను వినియోగించుకుని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని" కోరారు.

# ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- వ్యవసాయ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో ముందస్తు చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 09(ప్రజాతీర్పు ):**




రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో తలెత్తే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యత, సాగు పరిస్థితులు, ముందస్తు కార్యాచరణపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జూలై 30 వరకు ఎల్ నినో ప్రభావానికి సంబంధించి వాతావరణ పరిస్థితులను నిరంతరం పరిశీలించాలని సూచించారు. వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోతే వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, అవసరమైన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లు, ఆనకట్టలు, కాలువలు తదితర నీటి పారుదల వనరుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాధార పంటల సాగు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వర్షాలు ఆలస్యమైతే రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ కాల వ్యవధిలో పండే పంటలు, నీటి పొదుపు పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళిక (ప్లాన్ ఆఫ్ యాక్షన్) సిద్ధం చేసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, సి పి ఓ గంగారెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులు అనిల్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## హుటాహుటిన వేములవాడ ఆసుపత్రికి చేరుకున్న ప్రభుత్వ విప్, జిల్లా ఎస్పీ

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 9**

వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి, గితే.




## ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ అలుపెరుగని పోరాటం

తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారెడ్డి.

**(వంజరపు) ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) జూలై 9.**

మెదక్ జిల్లా మాసాయిపేట్ మండల కేంద్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ అలుపెరుగని పోరాటం చేస్తుందని సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారెడ్డి అన్నారు. గురువారం ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మాసాయిపేట మండల వ్యాప్తంగా ఉన్న రామంతపూర్, చెట్ల తిమ్మాయిపల్లి, పోతనపల్లి, బొమ్మారం స్కూల్లో వెళ్లి క్యాంపెయిన్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు అధికారంలోకి రాగానే పరిష్కారం చేస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. నేటికీ పి ఆర్ సి, ఆరు డి ఏలు పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని లేకపోతే ఈనెల 14న కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తపస్సు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారెడ్డి, మాసాయిపేట తపస్ మండల అధ్యక్షుడు భద్రయ్య మండల వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## వాసుదేవ శర్మ తన చర్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )జూలై 09**

రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ నాయకుడు గంగు ఉపేంద్రశర్మ ఖమ్మంలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ జగిత్యాల జిల్లా ధూపదీప నైవేద్య అర్చకుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం గొల్లపెల్లి మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ, గంగు ఉపేంద్రశర్మ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి అర్చకులకు తప్పుడు సమాచారం చేరవేస్తున్న వాసుదేవ శర్మ తన చర్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో రథయాత్రలు, చైతన్యయాత్రలు, హోమాల పేరుతో అర్చకులను తప్పుదోవ పట్టించి మోసం చేశారని విమర్శించారు. ఇకనైనా అలాంటి చర్యలను విరమించి, ధూపదీప నైవేద్య అర్చకుల సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. ధూపదీప నైవేద్య అర్చకులు ఐకమత్యంతో ముందుకు సాగితే తమ సమస్యలకు పరిష్కారం సాధించుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు మహేంద్రాచార్య, మాజీ అర్చక ఉద్యోగ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కాపురం నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు తిరునహరి సత్యనారాయణాచార్యులు, గొల్లపెల్లి మండల అధ్యక్షుడు కూర్మాచలం సత్యనారాయణాచార్యులు, అర్చకులు గోవర్ధన్ అనిల్, గణేష్ శర్మ, అనుపురం శ్రీనివాస్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



## నూతన వదు వరులని ఆశీర్వదించిన గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్..

**నర్సంపేట జూలై 9 ప్రజా తీర్పు**

చెన్నరావు పేట మండలం అక్కల్ చెడ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బాధవత్ భద్రు-బుజ్జి దంపతుల కుమారుడు సతీష్-కల్పన దేవి ల వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జిసురేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన వదు వరులని ఆశీర్వదించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్ మాజీ ఉప సర్పంచ్ బాణోత్ వీరన్న నాయక్ గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లావుడ్యా వెంకన్న బోనగిరి స్వామి నాయకులు బోనగిరి సారయ్య బాధవత్ పెద్ద వీరు వీరు బాధవత్ చందర్ ముత్యం భద్రయ్య మాలోత్ పూల్ సింగ్ వార్డు సభ్యులు బాధవత్ సురేష్ ఇస్లావత్ స్వరూపవీరు నాయకులు తేజవత్ భద్రు బాలు నాయక్ ఇస్లావత్ స్వామి తేజవత్ శివ కరెడ్ల శివ బాధవత్ వీరు వప్రాం వీరు భూక్య రాజేందర్ కొత్త కొమురయ్య మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ కయాజ్ బీమా తేజవత్ రాజు తేజవత్ స్వామి ఇస్లావత్ రాం చంద్రు బీమా దేవా మల్లు లావుడ్యా స్వామి రవీందర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు..



## ప్రభుత్వ విద్యార్థినిలకు చేయూత


**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 9.**

ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే ప్లేట్లు, గ్లాసులను గురువారం స్థానిక కౌన్సిలర్ అరవ లక్ష్మి చేతుల మీదుగా విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అరవ లక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ శాఖ విద్యార్థుల కోసం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వసతి గృహంలో ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం, సురక్షిత వాతావరణం మరియు ఇతర సౌకర్యాలను వినియోగించుకొని మరింత మంది విద్యార్థినులు ప్రభుత్వ వసతి గృహంలో చేరాలని పిలుపునిచ్చారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి. శ్రీలత మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి. శ్రీలత, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ లో ఘనంగా వాసవీ అమ్మవారి ఆలయ ద్వారబంధం ప్రతిష్ఠాపన

**బోడుప్పల్, జూలై 9: ( ప్రజాతీర్పు )**



బోడుప్పల్ వాసవీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి మాత దేవాలయంలో గురువారం ఉదయం గర్భగృహ పవిత్ర ద్వారబంధం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గర్భగృహ ద్వారబంధాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి బోడుప్పల్‌తో పాటు ఉప్పల్, మేడిపల్లి, పీర్జాదీగూడ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవాలయ నిర్మాణానికి రామంతపూర్‌కు చెందిన నరసాపురం నరేందర్ -- జయలక్ష్మి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 11,11,119 విరాళం అందజేశారు. వారి సేవలను ఆలయ ట్రస్ట్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే దేవాలయ నిర్మాణానికి సహకరించిన ఇతర దాతలకు ట్రస్ట్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులందరికీ ట్రస్ట్ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

## హుస్నాబాద్ నూతన సీఐ గా కే. శ్రీధర్

**హుస్నాబాద్ జులై 09 ప్రజాతీర్పు**



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్(సీఐ) గా కే. శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్ కు చెందిన సీఐ కే. శ్రీధర్ అంతకుముందు పనిచేసిన ప్రాంతాలలో మంచి పేరు సంపాదించారు. విధి నిర్వహణలో సక్రమంగా విధులు నిర్వహించారు. కాగా హుస్నాబాద్ సీఐ గా విధులు నిర్వహించిన కొంద్రు శ్రీను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు బదిలీ అయ్యారు. అయితే నూతన సీఐ గా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ కు ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులు శుభాకాంక్షలు చెప్పారు. హుస్నాబాద్ లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన కొంద్రు శ్రీను హుస్నాబాద్ లో విధులు నిర్వహించిన సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేశారు.




## జాతి పునర్నిర్మాణం ఏబీవీపీ తోనే సాధ్యం

### జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ

**హుస్నాబాద్ జులై 09 ప్రజాతీర్పు**

భారతదేశ జాతి ఏబీవీపీ తోనే సాధ్యమని జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ అన్నారు. జూలై 9 న ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకొని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గాంధీ చౌరస్తా మీదుగా మల్లె చెట్టు చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ మాట్లాడుతూ... దేశ చరిత్రలో ఏబీవీపీ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించి 5 మంది విద్యార్థులతో ప్రారంభమై 78 లక్షల విద్యార్థుల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. తెలంగాణ పశ్చిమ బెంగాల్ కేరళ తోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను నరహంతక నక్సలైట్ల తూటాలను ఎదిరించి జాతీయవాదాన్ని పెంపొందించడానికి భారత్ మాతాకీ జై అంటూ అనేకమంది ఏబీవీపీ కార్యకర్తలు ప్రాణ త్యాగాలు సైతం చేశారని గుర్తు చేశారు. అలాంటి మహావీరులు పుట్టిన తెలంగాణ గడ్డ జాతీయవాదాన్ని దేశభక్తిని విద్యార్థులకు తెలియజేయడంలో ఏబీవీపీ కార్యకర్తలు నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే విశ్వ గురువుగా నిలుపుకు ఏబీవీపీ 78 సంవత్సరాలుగా చేస్తున్న ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి రాజు, సిద్దిపేట జిల్లా ఎస్ ఎఫ్ డి కన్వీనర్ చరణ్, నగర ఉపాధ్యక్షుడు సంతోష్, నగర సంయుక్త కార్యదర్శి రంజిత్ మహిళా కన్వీనర్ శిరీష, ప్రసన్న విద్యార్థిని విద్యార్థులు, పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు 'సీసీ కెమెరాల' నిఘా అత్యంత కీలకం

- హుజురాబాద్ డివిజన్ పరిధిలో 21 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం.
- కమిషనరేట్ వ్యాప్తంగా మరో 700 కెమెరాల ఏర్పాటు లక్ష్యం.
- యువత డ్రగ్స్, సైబర్ గేమింగ్ అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలి.
- రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే 'రహవీర్' పథకం ద్వారా రూ.25 వేల బహుమతి

**జమ్మికుంట, జూలై 09 ప్రజాతీర్పు**



శాంతిభద్రతల పరిరక్షణలో నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం, ఐపీఎస్ పేర్కొన్నారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలోని సైదాబాద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను, కొరపల్లి గ్రామంలోని 05 సీసీ కెమెరాలను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం, జమ్మికుంట పట్టణ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు సీపీ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జమ్మికుంటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, ప్రజలతో ఏర్పాటు చేసిన విస్తృత అవగాహన సదస్సులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడిన ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...కమిషనరేట్ వ్యాప్తంగా 700 కొత్త సీసీ కెమెరాలే లక్ష్యం ప్రతి గ్రామం, పట్టణం కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి మూలను సీసీటీవీ నిఘా నీడలోకి తీసుకురావడమే పోలీసుల ముఖ్య ఉద్దేశం. రాబోయే రోజుల్లో కమిషనరేట్ పరిధిలో మరో 700 కొత్త కెమెరాలను అమర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సైదాబాద్ సర్పంచ్ రాజారామ్, కొరపల్లి సర్పంచ్ మధుసూదన్, స్థానిక ప్రజాప్రతినిధులకు, గ్రామ ప్రజలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఆన్‌లైన్ గేమింగ్ ముప్పు

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు, యువత ఆన్‌లైన్ గేమింగ్ బారిన పడి డబ్బులు నష్టపోవడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కరీంనగర్ జిల్లాలోనూ ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలి. మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరించండి.

యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వీటి సరఫరా లేదా వాడకంపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 'డయల్ 100' కు సమాచారం అందించాలి. యువత మత్తుకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారించాలి.

### ప్రాణాలు కాపాడితే రూ. 25,000 నగదు పురస్కారం

వాహనదారులు, ప్రయాణికులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి వారి ప్రాణాలు కాపాడే వారికి ప్రభుత్వం 'రహవీర్ పథకం' కింద రూ. 25,000 నగదు పురస్కారం అందిస్తుంది. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, జమ్మికుంట రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతిలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నేడు హుస్నాబాద్‌లో మంత్రుల విస్తృత పర్యటన

**సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్ జులై 09 ప్రజాతీర్పు**

నియోజకవర్గంలో నేడు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు అక్కన్నపేట మండలం జనగామలో ఆయిల్ పామ్ మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 10:30 గంటలకు తోటపల్లిలో ఏటీసీ నిర్మాణ పనులకు, 11 గంటలకు ఉమ్మాపూర్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. 11:30 గంటలకు హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా, టామ్‌కామ్ అవగాహన శిబిరానికి మంత్రులు హాజరవుతారని మంత్రి క్యాంపు కార్యాలయం తెలిపింది. ఈ పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఎస్ఐఆర్ విజయవంతానికి అన్ని పార్టీలు సహకరించాలి

- కోహెడ తహసిల్దార్ నవీన్ కుమార్

**కోహెడ జులై 09 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఫారాల పంపిణీ 100శాతం పూర్తయినట్టు తహసిల్దార్ నవీన్ కుమార్ తెలిపారు. మండలం లోని 38598 మంది ఓటర్లు దరఖాస్తు ఫారాలను నింపి అందజేసే విధంగా చూడాలని అన్ని రాజకీయ పార్టీల నేతలను కోరారు. గురువారం తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన రాజకీయ పార్టీల నేతల ఎస్ఐఆర్ అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 15328 ఫారాలు ఆన్లైన్లో నమోదు చేయడంతో నియోజకవర్గస్థాయిలో సుమారు 40% ఆన్లైన్ లో నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నమోదు ప్రక్రియ ఈ నెల 15 తేదీ వరకు చివరి రోజు కావడంతో వివిధ రాజకీయ పార్టీలు నాయకులు ఇట్టి ప్రక్రియలో భాగస్వాములై 100% నిర్ణీత సమయంలోగా పూర్తి చేయడానికి అన్ని విధాల సహకరించగలరని తహసిల్దార్ రాజకీయా పార్టీల నేతలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అధ్యక్షులు శెట్టి సుధాకర్ బిజెపి పార్టీ మండల అధ్యక్షులు జాలిగం రమేష్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుండారెడ్డిపల్లి మాజీ ఎంపిటిసి సుతారి కనకయ్య, మంద సురేష్, సిపిఐ పార్టీ నాయకులు శంకర్, బిజెపి సోషల్ మీడియా కన్వీనర్,స్థానిక వార్డ్ సభ్యులు గుగ్గిళ్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల శివారెడ్డితో పాటు సీనియర్ అసిస్టెంట్ రాములు ఆర్ఐ సంజీవ్ ఎల్లయ్య జూనియర్ అసిస్టెంట్ పూర్ణచంద్, కంప్యూటర్ ఆపరేటర్ స్వామి, బాలు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ భవనం కబ్జాపై చర్యలు తీసుకోండి: మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

- మండల పరిషత్ కార్యాలయంలో బి ఆర్ ఎస్ నేతలు, గ్రామస్తుల వినతి
- ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో అధికారులు విఫలమైతే నిరసనలు తప్పవు


**బీర్పూర్ జులై 09 (ప్రజా తీర్పు )**

బీర్ పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనం కబ్జాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి నాయకులు, గ్రామస్తులు కలిసి మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, సర్వే నెంబర్ 22 (హౌస్ నెంబర్ 3-96) లో అంగన్‌వాడీ భవనం ఉన్నట్లు ఎమ్మార్వో నివేదిక ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్ బోగ లత ఆసరాగా చేసుకొని, పోస్ట్ ఆఫీస్ ఉద్యోగి భోగ సత్తయ్య ఆ బిల్డింగ్‌ను కబ్జా చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్నారని ఆరోపించారు. మొన్నటి ప్రజావాణిలో కలెక్టర్ కబ్జాను తొలగించాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమన్నారు. ఎంపీఓ తక్షణమే స్పందించకపోతే గ్రామస్తుల నిరసనలు ఎలా ఉంటాయో చెప్పలేమని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం పోరాడుతున్న గ్రామస్తులపై పోలీసులు అక్రమంగా లాఠీచార్జి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే చట్టం కోసం నిలబడే ప్రజలకు అండగా ఉండడమే కానీ, కబ్జాదారులకు మద్దతు ఇవ్వడం కాదన్నారు. అలాగే, గోడ కూలగొట్టిన రైతు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌లో పెట్టుకోవడం నేరమని, వ్యవసాయ పనుల వేళ దాన్ని వెంటనే ఓనర్‌కు లేదా కోర్టుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు గౌరవం సర్కార్ లక్ష్యం

- గుర్తింపు కమిటీ చైర్మన్ కే కేశవరావు.

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్)**
**జూన్, 8:**



తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులందరికి గౌరవం దక్కాలన్నదె ప్రభుత్వం లక్ష్యం అని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కే కేశవరావు పేర్కొన్నారు. ఉద్యమంలో మొదటి నుండి అనగా 1969 నుండి 2014 జూన్ 2 వరకు అనగా తెలంగాణ సాధించే వరకు జరిగిన ఉద్యమాలలో భాగస్వాములైన అందనరి అభిప్రాయం సేకరించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణ సచివాలయం ఉన్న అమరవీరుల స్వాగతం భవనంలో కమిటీ సోమవారం తొలిసారిగా సమావేశం అయింది. హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారులు 58 మంది కమిటీ ముందు పలు అంశాలు ఉంచారు. తెలంగాణ సాధన ఉద్యమకారులకు ప్రభుత్వమే 250 గజాల స్థలం ఇస్తానని హామీ ఇచ్చిందని, అందులో ఇల్లు కూడా నిర్మించి ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులకి పెన్షన్ సదుపాయం కల్పించాలని హెల్త్ కార్డులు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ కేశవరావు మాట్లాడుతూ.. ఈ నెలాఖరు వరకు రాతపూర్వకంగా ఆన్లైన్ ద్వారా అభిప్రాయాలు సేకరణ చేపడతామని ఉద్యమకారులను గుర్తించడం ఎలా అనే అంశంపై సూచనలు పంపాలని కోరారు. ఉద్యమకారులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వికలాంగుల విద్యార్థి ఉద్యమకారుడు మొక్క ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యమగార్లకు ఇస్తానన్న 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి, దివ్యాంగులకు ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమకారుల కాలనీ పేరుతో లేదా జైపాల్ రెడ్డి కాలనీగా ఏర్పాటుచేసి, రెండు కోట్లతో రుణాన్ని మంజూరు చేసి ఉపాధిని కల్పించాలని, స్వాతంత్ర సమరయోధుల పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డిలు మాట్లాడారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు పిడమర్తి రవి, కోటూరి మానవతారాయ్, నిజ్జన రమేష్, బట్టు శ్రీహరి, కంచర్ల బద్రి, మొక్క ఉపేందర్, నకిరేకంటి అశోక్, వెంకన్న, బండి శ్రీనివాసరావు, వీరబాబు, భాస్కర్, కోటా శ్రీనివాసరావు, నెహ్రూ నాయక్, డాక్టర్ స్వప్న, పలుస ఆంజనేయులు, చుంచు కుమార్, శోభన్ శ్రీనివాస్ బజ్జుర్ల, శంకర్, కమలాకర్, శంకర్ నాయక్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ లో బీఎల్ఓల ఇష్టారాజ్యం - భర్తల పెత్తనం!

- అశ్వారావుపేటలో గాడితప్పిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ?
- ఇంటింటికీ వెళ్లాల్సిన అధికారులు ఇళ్లకే పరిమితం.. ప్రజలనే రమ్మంటూ హుకుం!
- "ఓటు ఉంచాలా? తీసేయాలా?" అంటూ అనధికార వ్యక్తుల బెదిరింపులు!
- ఆందోళనలో వృద్ధులు, దివ్యాంగులు.. అధికారుల స్పందన కరువేనా?




**అశ్వారావుపేట, జూలై 9,(ప్రజా తీర్పు )**

ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ లాంటి ఓటు హక్కు ప్రక్రియ అశ్వారావుపేటలో అభాసుపాలవుతోంది. ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఇక్కడ కొందరు అధికారుల నిర్లక్ష్యం, అనధికార వ్యక్తుల జోక్యంతో దారి తప్పుతోంది. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలోకి వెళ్లాల్సిన బూత్ స్థాయి అధికారులు ఏసీ గదులు, సొంత ఇళ్లకు పరిమితం కాగా, వారి స్థానంలో వారి భర్తలు రంగప్రవేశం చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తుండడం తీవ్ర కలకలం రేపుతోంది.

### జీతాలు ప్రభుత్వానివి.. విధులు భర్తలవా?

?ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాల ప్రకారం బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ కాలినడకన వెళ్లాలి. ఓటర్లను కలిసి సవరణ దరఖాస్తులు అందజేయాలి. ఫారాలు ఎలా నింపాలో, ఏయే పత్రాలు జత చేయాలో అవగాహన కల్పించాలి. కానీ అశ్వారావుపేటలో సీన్ రివర్స్ అయింది. మా ఇంటికి వచ్చి అప్లికేషన్లు పట్టుకెళ్ళండి అంటూ అధికారులు ఓటర్లకే ఫోన్లు చేస్తుండడం గమనార్హం. కూలీ పనులకు వెళ్లే పేదలు, నడవలేని వృద్ధులు, దివ్యాంగులు ఈ ఎండల్లో అధికారుల ఇళ్ల చుట్టూ తిరగలేక బెంబేలెత్తిపోతున్నారు.

?దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో అధికారుల భర్తలు తామే అధికారులుగా అవతారమెత్తారు. ఓటర్లకు ఫోన్లు చేసి, నీ ఓటు ఉంచాలా. తీసేయాలా.?" వెంటనే రాకపోతే ఓటు కట్ అవుతుంది అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇంట్లోని అందరి ఆధార్ కార్డులు, ఫొటోలు తెచ్చి ఒకరే సంతకాలు పెట్టేయాలంటూ నిబంధనలకు విరుద్ధంగా ఆదేశిస్తుండడం చూస్తుంటే. అసలు ఇక్కడ ఎన్నికల నిబంధనలు అమలువుతున్నాయా లేక సదరు భర్తల సొంత చట్టాలు నడుస్తున్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### గడువు ముగుస్తున్నా అందని దరఖాస్తులు!

?మండలంలోని పలు వార్డుల్లో ఇప్పటివరకు సవరణ దరఖాస్తుల పంపిణీనే కాలేదనేది పచ్చి నిజం. గడువు ముంచుకొస్తున్నా తమకు ఫారాలు అందకపోవడంతో ఎక్కడ తమ ఓటు హక్కు గల్లంతవుతుందోనని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నా, బాధ్యత గల ఉన్నతాధికారులు మాత్రం కార్యాలయాలకు పరిమితమవ్వడం విమర్శలకు తావిస్తోంది.

### క్షేత్రస్థాయి వైఫల్యాలు - ప్రజల డిమాండ్లు

ఇంటింటికీ వెళ్లకుండా ఇళ్లలోనే తిష్టవేసిన అధికారులు. ఉన్నతాధికారులు వెంటనే క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించి భర్తల అనధికారిక పెత్తనం. వార్డులపై అవగాహన ఉన్న అధికారిక సహాయక సిబ్బందిని నియమించాలి. బెదిరింపుల పర్వం, ఒకరితోనే అందరి సంతకాలు పెట్టించడం. నిబంధనలు మీరిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

### సమాధానం చెప్పాల్సింది ఎవరు?

ఈ అక్రమాలపై ప్రజలు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే, కార్యాలయాల్లోని కొందరు సిబ్బంది వారు సహాయక సిబ్బందిగా ఉన్నారులే అంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు. ఒక ప్రభుత్వ విధిని నిర్వర్తించడానికి అనధికార వ్యక్తులకు సహాయక సిబ్బంది అనే హోదా కల్పించే హక్కు వీరికి ఎవరిచ్చారు? ?అశ్వారావుపేట మండల ప్రజలు నేరుగా ఎన్నికల సంఘాన్ని కొన్ని సూటి ప్రశ్నలు అడుగుతున్నారు. ?ప్రజల ఇళ్లకు వెళ్లాల్సిన అధికారులు ఎందుకు వెళ్లడం లేదు? ?అధికారిక విధుల్లో లేని భర్తలు ఓటర్లను బెదిరిస్తుంటే విచారణ ఎందుకు లేదు? ?ఇంకా దరఖాస్తులు అందని వార్డుల పరిస్థితి ఏమిటి? ?ప్రజలను అధికారుల ఇళ్ల చుట్టూ తిప్పడం మానేసి, బూత్ స్థాయి అధికారులనే ప్రజల వద్దకు పంపేలా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి. ఈ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

## మరో సిరీస్ పాయె..

# నాలుగో టీ20లోనూ భారత్ చిత్తు

### కెప్టెన్ అయ్యర్ మెరుపులు వృథా

టీ20 వరల్డ్ చాంపియన్ భారత్‌కు మరో భంగపాటు. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయ కత్వంలో టీమిండియా వరుసగా రెండో సిరీస్ కోల్పోయింది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్ అయిన భారత్.. ఇప్పుడు ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను కూడా చేజార్చుకుంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 80 నాటౌట్) మెరిసినా మిగతా వాళ్లంతా నిరాశపరచడంతో గురువారం రాత్రి జరిగిన నాలుగో టీ20లో 9 వికెట్ల తేడాతో ఇంగ్లిష్ టీమ్ చేతిలో చిత్తయింది. భారత్ ఇచ్చిన 159 పరుగుల లక్ష్యాన్ని ఆతిథ్య జట్టు 13.5 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి ఛేజ్ చేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 79 నాటౌట్), ఫిల్ సాల్ట్ (59 నాటౌట్) దంచికొట్టారు. దాంతో మరో మ్యాచ్ మిగిలుండగానే ఐదు టీ20 సిరీస్‌ను 3-0తో సొంతం చేసుకుంది.

తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 158/7 స్కోరు చేసింది. యంగ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (15) ఓ సిక్స్, ఫోర్ కొట్టి మరోసారి ఆర్చర్‌కు వికెట్ ఇచ్చుకోగా.. ఇషాన్ (4), అభిషేక్ (16) ఫెయిలయ్యారు. 48/3తో భారత ఇబ్బందుల్లో పడిన దశలో కెప్టెన్ అయ్యర్ ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకున్నాడు. శివమ్ దూబే (22) కాసేపు సహకారం అందించినా తిలక్ (11), సుందర్ (5) నిరాశపరచడంతో భారత్ తక్కువ స్కోరుకే పరిమితం అయ్యింది. ఆర్చర్ (2/20), జోష్ టంగ్ (2/36) చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య చివరి, ఐదో టీ20 శనివారం జరుగుతుంది.



## సోషల్ మీడియాను షేక్ చేస్తోన్న 'టాక్సిక్' బోల్డ్ సాంగ్.. ఈ సినిమాకు కియారా పారితోషికం ఎంతో తెలుసా?



'రాకింగ్ స్టార్' యష్ హీరోగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'టాక్సిక్ '. . 'కేవీఎన్ ప్రొడక్షన్స్' సంస్థ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పాన్ ఇండియా లెవెల్ లో ఈ మూవీని నిర్మిస్తోంది. యశ్ సరసన నయనతార, కియారా అద్వానీ హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ ఈ సినిమాలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడిన ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఎట్టకేలకు ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్, టీజర్స్ హాట్ టాపిక్ గా మారాయి. సినిమాలో హింసతో పాటు రొమాంటిక్ సీన్స్ ఓ రేంజ్ లో ఉన్నాయని అర్థమైంది. ఇక తాజాగా 'టాక్సిక్' సినిమా నుంచి 'తబాహి' వీడియో సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో కియారా అందాలు ఆరబోసింది. గతంలో ఎన్నడూ లేనంతగా హాట్ హాట్ గా కనిపించింది. అందుకు తగ్గట్టుగానే యూట్యూబ్‌లో విడుదలైన నిమిషాల వ్యవధిలోనే తబాహి సాంగ్ ట్రెండింగ్ లోకి వెళ్లిపోయింది. ఇప్పటికే ఈ సాంగ్ కు మిలియన్ల కొద్దీ వ్యూస్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తబాహి సాంగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతోంది. అదే సమయంలో ఈ సినిమా కోసం కియారా తీసుకున్న రెమ్యునరేషన్ పై కూడా చర్చ జరుగుతోంది. . ఈ సినిమాలో కియారా చాలా హాట్‌గా కనిపించింది. అందుకోసం ఆమె భారీ పారితోషికం డిమాండ్ చేసిందని తెలుస్తోంది. అయితే పాన్ ఇండియా లెవెల్ లో కియారాకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఆమె అడిగిన పారితోషికాన్నే నిర్మాతలు ఇచ్చారని తెలుస్తోంది. , 'టాక్సిక్' చిత్రం కోసం కియారా అద్వానీకి ఏకంగా రూ. 15 కోట్లు పారితోషికంగా చెల్లించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె సినీ కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం. 'గేమ్ ఛేంజర్' సినిమాకు కియారా సుమారు రూ. 5 నుంచి 7 కోట్ల పారితోషికం అందుకుంది.

## ఆ సినిమాతో ఆయనకు పేరు వచ్చింది.. కానీ డబ్బులు రాలేదు.. అనుష్క కామెంట్స్..

ఓ ఇంటర్వ్యూలో అనుష్క మాట్లాడుతూ తన సినీ ప్రయాణం, మూవీస్ గురించి ఆసక్తిర విషయాలు పంచుకుంది. ప్రత్యేకించి బాహుబలి, రుద్రమదేవి చిత్రాల అనుభవాలను ఆసక్తికరంగా వివరించారు. బాహుబలి భారీ విజయం సాధించినప్పటికీ, తన పాత్రకు మొదటి భాగంలో గ్లామర్ లేకపోవడంపై ఆమె స్పందించారు. అయితే, బాహుబలి రెండో భాగంలో తన పాత్ర సూపర్ హిట్ అయిందని గుర్తు చేసుకున్నారు. బాహుబలి తర్వాత రుద్రమదేవి విడుదల కావడంతో, అంతటి విజయాన్ని సాధిస్తుందా అనే భయం తనకు ఉండేదని అనుష్క తెలిపారు. అయితే, ఆమె దృష్టి డబ్బు సంపాదనపై కాకుండా, చిత్రీకరణ సమయంలో పడే కష్టంపైనే ఉంటుందని చెప్పారు. "నాకెన్ని భయాలు, అభద్రతా భావాలు ఉన్నా, అవన్నీ షూటింగ్ సమయంలోనే ఉంటాయి. సినిమా విడుదలైన తర్వాత, అది సక్సెస్ అయినా కాకపోయినా నన్ను అంతగా ప్రభావితం చేయదు" అని ఆమె పేర్కొన్నారు. దర్శకుడు గుణశేఖర్ రుద్రమదేవి కోసం అపారమైన కృషి చేశారని, ఒక అమ్మాయిని ప్రధాన పాత్రగా పెట్టి సినిమా తీయడం సాధారణ విషయం కాదని, ఆయన స్క్రిప్ట్‌పై నమ్మకంతో చేశారని అన్నారు. కానీ సినిమాకు పేరుతో పాటు, నిర్మాతలకు, పంపిణీదారులకు ఆర్థికంగా కూడా లాభం అంతగా రాలేదని అన్నారు. అతడు సినిమా హిట్ అవ్వడానికి కారణం ఆయనే.. నాజర్ కామెంట్స్.. రుద్రమదేవి పాత్ర గురించి తనకు మొదట కాకతీయ సామ్రాజ్యం గురించి మాత్రమే తెలుసని, గుణశేఖర్ గారు రెండున్నర, మూడు గంటలు కథను వివరించినప్పుడు ఆశ్చర్యపోయానని అనుష్క చెప్పారు. దక్షిణ భారతదేశంలో ఇంత గొప్ప, ఎమోషనల్, పెయిన్‌ఫుల్ చరిత్ర ఉందని, దాని గురించి మనకు తెలియకపోవడం బాధాకరమని ఆమె అన్నారు. మన చరిత్ర గురించి చదవడం ప్రారంభించాలని అన్నారు. రుద్రమదేవి పాత్ర కోసం గుర్రపు స్వారీ, ఏనుగుపై ఫైట్లు, కత్తి యుద్ధాలు వంటివి చేయాల్సి వచ్చిందని అనుష్క వివరించారు. గుర్రాలంటే తనకు ఇప్పటికీ భయం ఉందని, అవి ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాయో తెలియదని అన్నారు.





## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- బాలికల.. బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యాధికారిణి కల్పన

**మంథని, జూలై-09 (ప్రజాతీర్పు)**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా అధ్యాపకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా ఇంటర్ విద్యాధికారిణి కల్పన సూచించారు. గురువారం మంథనిలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించి గత ఏడాదితో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో మరింత ఎక్కువ అడ్మిషన్లు జరిగేలా కృషి చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో లభించే నాణ్యమైన విద్య, సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితేనే ప్రభుత్వ కళాశాలలు మరింత బలోపేతం అవుతాయని, విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధ్యాపకుడిపై ఉందన్నారు. అనంతరం ఆమె తరగతి గదులను సందర్శించి విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. కళాశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు బాలోజీ, ఉషాతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



## యువజన హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

- ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ జూలై 09 )**

అఖిల భారత యువజన సమాఖ్య ( ఏఐవైఎఫ్ ) కరీంనగర్ నగర 14 వ మహాసభ నగర అధ్యక్షులు చెంచల మురళి అధ్యక్షతన బద్దశీ ఎల్లారెడ్డి భవన్లో గురువారం జరిగింది. మహాసభల సందర్భంగా ఏర్పాటుచేసిన ఏఐవైఎఫ్ పతాకాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి బావశీడ్ల పల్లి యుగంధర్ ఎగరవేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిథి హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు, హక్కులను సాధించుకునేందుకు యువతి, యువకులను ఐక్యపరిచి 1953 మే 3వ తేదీన ఆవిర్భవించిందని నాటి నుండి నేటి వరకు యువజన హక్కుల సాధనే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలని కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రలు చేసి ఓటు హక్కు కల్పించిన ఘనత ఒక ఏఐవైఎఫ్ కే దక్కింది అన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, ఈ దేశంలో కోట్లాదిమంది యువత విద్య, ఉపాధి అవకాశాలు లేక ఉన్నత చదువులు చదివి అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని గత 12 సంవత్సరాల క్రితం చెప్పిందని కానీ నేటికీ 12సంవత్సరాలు అయినా కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రతి ఏటా ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ కూడా పూర్తిగా మాట తప్పిందని పేర్కొన్నారు.వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్ల పెల్లి యుగంధర్ మాట్లాడుతూ యువతకు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతుందని నిరుద్యోగానికి అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈనెల 13వ తేదీన ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, నగరం నుండి యువత పెద్ద ఎత్తున తరలివచ్చి జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని నగర కార్యకర్తలకు యుగంధర్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు బీర్ల పద్మ, ఏఐవైఎఫ్ నాయకులు కసిబోజుల సంతోషి చారి కాల్వ శ్రీనివాస్ యాదవ్ మేకల రమ సంపత్ నాయక్ జువ్వాడి తిరుపతి హేమంత్ శ్రావణ్ బిర్లా స్వాతి ఉదయ భాస్కర్ అరవింద్ పూజ వినయ్ నునావత్ శ్రీనివాస్ జహంగీర్ అంజయ్య బోయిని విష్ణు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్పెయిన్‌కు బెల్జియం సవాల్.. నేడు కీలక క్వార్టర్ ఫైనల్

ఫిఫా ప్రపంచకప్ తుదిదశకు చేరుకుంటున్న సమయంలో మరో ఆసక్తికర సమరం అభిమానులను అలరించనుంది. అమెరికాపై ఘన విజయం సాధించిన జోష్‌లో ఉన్న బెల్జియం.. శుక్రవారం అర్ధరాత్రి జరిగే క్వార్టర్స్‌లో అజేయంగా దూసుకుపోతున్న బలమైన స్పెయిన్‌తో తలపడనుంది. ప్రీక్వార్టర్స్‌లో అమెరికాను 4-1 తేడాతో చిత్తు చేసిన బెల్జియం అదే ఊపును కొనసాగించి సెమీస్ చేరాలని పట్టుదలగా ఉంది. మరోవైపు ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకు ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా.. అజేయంగా నిలిచిన స్పెయిన్ కూడా టైటిల్ దిశగా ముందజ వేయాలని డిసైడైంది. అయితే గతపోరులో అమెరికాను ఓడించిన తర్వాత బెల్జియం ప్లేయర్లు గ్రౌండ్‌లో, డ్రెస్సింగ్ రూమ్‌లో యూఎస్ఏ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకరించేలా సంబరాలు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, RNI Reg no. APTEL/2001/5268 printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020